# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 10-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:34 పేజీలు:6 వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

ఆరోగ్య బీమా
ఉద్యోగ పెన్షనర్లు
సాధన ధీమా

హైడ్రోజన్ రైలు
పర్యావరణ హితం
కాలుష్యం శూన్యం

భయం వీడాలి
జ్ఞానంతో ఎదగాలి
చేపలవ్వాలి.

జ్ఞాన ప్రయాణం
డాలర్ల మోజులోన
మొదటి కే మోసం.

నెల్సన్ మండేల
అతనిలా ఉండాలి
అస్తిత్వ పోరు.

\- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

శాసన సభ వాకిట్లో
సభ్యులతో సభ భంగం!
అసెంబ్లీ ప్రారంభమే
అసభ్యంగ రణరంగం!
ఆంబోతుల పార్టీలతో
కొట్లాటలకు తయ్యారు!
మనసు ఉన్న మనుషులిలా
పిచ్చి జంతువులయ్యారు!

\- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## ఢిల్లీలో ఆక్సిజన్ సిలిండర్ పేలుడు..

# ఒకరు మృతి.. నలుగురికి గాయాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: దేశరాజధాని ఢిల్లీలో ఆక్సిజన్ సిలిండర్ పేలిన ఘటనలో ఒకరు మరణించగా, మరో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన ఢిల్లీ, ఓఖ్లా ఫేజ్-1లో బుధవారం ఉదయం జరిగింది. ఒక కమ్యూనిటీ హాల్‌లో ఉన్న ఆక్సిజన్ సిలిండర్ ఉదయం 11.30 గంటల సమయంలో పేలిపోయింది. ఈ ఘటనలో అక్కడే ఉన్న ఒక వ్యక్తి మరణించగా, మరో నలుగురు గాయపడ్డారు. దీని గురించి 11.55 గంటలకు పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందింది. వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు.

అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు చేరుకున్నాయి. ఘటనలో గాయపడిన వారిని వెంటనే అంబులెన్సుల్లో స్థానిక ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. మరో వ్యక్తి ఘటనా స్థలంలోనే మరణించగా.. అతడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సిలిండర్ పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఢిల్లీలో ఇటీవలే సత్యనికేతన్ పీజీ హాస్టల్ భవనం కూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటివరకు ఏడుగురు మరణించారు. ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఈ బిల్డింగ్ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఈ బిల్డింగ్ యజమాని హరిరాం , ఆయన భార్య ఊర్మిళ, తనయుడు మహేష్ బన్సల్‌ను పోలీసులు అరెస్టు చేయగా.. వారు ఈ బిల్డింగ్‌ను శుభం త్యాగి, శుభాన్షులకు లీజుకు ఇచ్చినట్లు చెప్పారు. దీంతో వీరిలో శుభాన్షును పోలీసులు అరెస్టు చేశారు. శుభం కోసం గాలిస్తున్నారు. వీరు హాస్టల్ డేజ్ పేరుతో ఈ పీజీని నిర్వహిస్తున్నట్లు పోలీసులు తేల్చారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు, ఢిల్లీ మున్సిపల్ అధికారులు సిద్ధమవుతున్నారు.

# గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం.. న్యాయం జరగకపోతే మానవహక్కుల కమిషన్‌కు వెళ్తాం : కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 9: రేవంత్ రెడ్డి సర్కారు ప్రతిపక్ష బీఆర్ఎస్ పట్ల వ్యవహ రించిన తీరుపై తాము గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. తమకు ఇక్కడ న్యాయం జరగకపోతే ఢిల్లీలోని మానవ హక్కుల కమిషన్‌కు, జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రేవంత్ రెడ్డి 1000 రోజుల అసమర్థ పాలనపై తాము ప్రజల తరఫున ప్రశ్నిస్తే తమపై అరాచకానికి పాల్పడ్డారని విమర్శించారు. తాము ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ద్వారా తప్పు చేశామా.. అని ప్రశ్నించారు.

ఎన్నికలప్పుడు 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, 1000 రోజులు గడిచినా అమలు చేయని హామీల గురించి ప్రభుత్వాన్ని నిలదీయడం తప్పా.. అని కేటీఆర్ క్వశ్చన్ చేశారు. కాంగ్రెస్ అసమర్థతపై చర్చించేందుకు తాము అసెంబ్లీకి వెళ్లినప్పుడు, పోలీసులు తమను గేటు వద్ద అడ్డుకుని దాడి చేయడమే కాకుండా, తమ మహిళా ఎమ్మెల్యేలపట్ల అసభ్యంగా ప్రవర్తించారని మండిపడ్డారు. ఇందుకు సంబంధించిన ఆధారాలన్నింటితో తాము గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు.

తమ ఫిర్యాదుపై చీఫ్ సెక్రెటరీ, డీజీపీతో విచారణ చేయిస్తానని గవర్నర్ చెప్పారని కేటీఆర్ తెలిపారు. ఒకవేళ ఇక్కడ న్యాయం జరగకపోతే, తాము ఢిల్లీలోని మానవ హక్కుల కమిషన్‌కు, మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అదేవిధంగా కేసీఆర్ ఇంటిపై దాడి చేయడానికి వెళ్లిన కాంగ్రెస్ గుండాలకు పోలీసులు ఎర్ర తివాచీ పరిచినట్లుగా వ్యవహరించి, వారిని దగ్గరుండి తీసుకెళ్లిన ఘటనపై కూడా తాము గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు.

## కేసీఆర్‌పై చెడును కాంగ్రెస్ ఎప్పుడూ కోరుకోలేదు: మహేశ్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 9: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎప్పుడూ చెడును కోరుకోలేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈరోజు (బుధవారం) అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. కేసీఆర్‌కు చెడు జరగాలని ఎమ్మెల్యే హరీశ్ రావు పూజలు చేశారని స్వయంగా కవిత చెప్పారని అన్నారు. తాము ఏరోజూ కేసీఆర్ చెడు కోరుకోలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎవరి చెడునూ కోరుకోదని స్పష్టం చేశారు.

కేసీఆర్ ఆరోగ్యం పట్ల వేరే ఆలోచన లేదని టీపీసీసీ చీఫ్ అన్నారు. కేసీఆర్ బాత్‌రూమ్‌లో జారీ పడితే గ్రీన్ ఛానల్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి వైద్యం చేయించిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడు ఆరోగ్యం గురించి అడిగిన సంగతి గుర్తులేదా అంటూ నిలదీశారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి మాత్రమే కోరుకుంటున్నారని తెలిపారు. ప్రతిపక్ష నేతను కాంగ్రెస్ గౌరవిస్తుందని చెప్పారు.

55 మంది సిబ్బందితో కేసీఆర్ ఫాంహౌస్ దగ్గర ప్రభుత్వం సెక్యూరిటీ పెట్టిందని మహేశ్ వెల్లడించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. రేవంత్ రెడ్డి అభిమాని అని.. ఆ అభిమానంతోనే ఆయన అలా మాట్లాడి ఉండొచ్చన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తీరు దళిత సమాజాన్ని అవమానించే విధంగా ఉందని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.

**చురక**

పోటాపోటీ ధర్నాలతో
పొక్కిలాయే రాజనీతి
పార్టీల బలాబలం
పదర్శించే దాని ఖ్యాతి.
రసిగారే బూతులతో
రాజకీయ ఋతుకాలం
ఎన్నికలు రాకముందే
ఎందుకింత రణమేళం

\-వేల్పుల నారాయణ
9440433475

**రాధశ్రీ రాగాలు**

బ్రతుకులో ప్రతి కణము
పెట్టుచుందురు పణము
దేశజు లనుక్షణము
అనును రాధశ్రీ !!
దేశమును ప్రేమించు
తృప్తితో జీవించు
విజయమును సాధించు
మనును రాధశ్రీ !!

\-రాధశ్రీ
సెల్:9494481210

# కుట్రపూరితంగా సభను అడ్డుకోవాలని కుట్ర చేశారు: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 9: బీఆర్ఎస్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫామ్‌హౌస్‌లో కుట్రకు ప్రణాళికలు రూపొందించారని ఆరోపించారు. ఈరోజు (బుధవారం) అసెంబ్లీలో ముఖ్యమంత్రి పలు అంశాలపై మాట్లాడారు. కుట్రపూరితంగా సభను అడ్డుకోవాలని బీఆర్ఎస్ సభ్యులు కుట్ర చేశారని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలపై చర్చ కోసమే తాము అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. 22ఏ భూములు సహా అన్ని అంశాలను చర్చించాలనుకున్నామని పేర్కొన్నారు. ఈ అంశాలపై చర్చ జరిగితే వారికి రాజకీయ సమాధి తప్పదని కుట్ర చేశారని ఆగ్రహించారు.

# సీఎంపై మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలు.. అసెంబ్లీ స్పీకర్ అభ్యంతరం



హైదరాబాద్, సెప్టెంబర్ 9:సీఎం రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధ్వజమెత్తారు. ఏలేటి చేసిన వ్యాఖ్యలపై స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎంను అవమానపరిచి, ఏకవచనం ప్రయోగిస్తుంటే ఏం చేయాలి.. అని ప్రశ్నించారు. మహేశ్వర్ రెడ్డి కూడా ఏకవచనం ప్రయోగిస్తున్నారని అన్నారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కోరారు.

### సభ ఔన్నత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది: భట్టి విక్రమార్క

సభలో మైక్ ఇస్తే సీఎం రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడటం సరికాదని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఏలేటి ఇలా మాట్లాడటం బాధాకరమని ధ్వజమెత్తారు. సభ ఔన్నత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని భట్టివిక్రమార్క పేర్కొన్నారు.

### మహేశ్వర్ రెడ్డి సీఎంను ఏకవచనంతో మాట్లాడారు: మంత్రి సీతక్క

సీఎం రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడిన మాటలను వెనక్కు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈరోజు (బుధవారం) అసెంబ్లీలో మంత్రి సీతక్క మాట్లాడారు. పోడియంలో ఫ్ల కార్డులు ప్రదర్శించవద్దనే రూల్ ఉందని తెలిపారు. అయినా బీజేపీ నేతలు పోడియంలోకి వచ్చి ఫ్ల కార్డులు ప్రదర్శిస్తున్నారని చెప్పుకొచ్చారు.

దళితులు నిరసన తెలిపిన ఎర్రవల్లి ఫాంహౌస్‌ను శుద్ధి చేయడం దుర్మార్గమని మండిపడ్డారు.కాంగ్రెస్ అగ్రనేత మల్లికార్జున ఖర్గే వెళ్లి వచ్చిన చోట బీజేపీ నేతలు కూడా అలాగే శుద్ధి చేశారని ఆగ్రహించారు. బీజేపీ, బీఆర్ఎస్ భావజాలం ఒకటేనని విమర్శించారు. బీఆర్ఎస్‌కు మద్దతుగా బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు.

### పంచాయతీరాజ్ చట్టం- 2018 సవరణ బిల్లును ప్రవేశ పెట్టిన మంత్రి సీతక్క

కాగా, అసెంబ్లీలో పంచాయతీరాజ్ చట్టం- 2018 సవరణ బిల్లును మంత్రి సీతక్క ప్రవేశ పెట్టారు. గ్రామ పంచాయతీల సొంత ఆదాయం సమీపంలోని నేషనల్ బ్యాంకులో జమ చేసుకునేలా చట్ట సవరణ చేశారు. ప్రస్తుతం గ్రామపంచాయతీల సొంత ఆదాయం ట్రెజరీలో జమ చేసినట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు.

### అసెంబ్లీ నడవకుండా బీజేపీ సభ్యులు అడ్డుపడుతున్నారు: మంత్రి కోమటిరెడ్డి

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డిపై తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎంను ఏకవచనంతో ఆయన మాట్లాడారని ధ్వజమెత్తారు. మహేశ్వర్ రెడ్డి ఆ వ్యాఖ్యలను వెంటనే వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ నడవకుండా బీజేపీ సభ్యులు అడ్డుపడు తున్నారని మండిపడ్డారు. దళితులు నిరసన తెలిపిన ఎర్రవల్లి ఫాంహౌస్‌ను శుద్ధి చేసి వారిని అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు తెలంగాణలో దళితులు ఉండవద్దని కోరుకుంటున్నారా అని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు.

### అసెంబ్లీలో సబ్జెక్ట్‌పై మాట్లాడే ఆలోచన బీజేపీకి లేదు: : మంత్రి శ్రీధర్‌బాబు

బలహీన వర్గాల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. దళితులు నిరసన తెలిపిన ఎర్రవల్లి ఫాంహౌస్‌ను శుద్ధి చేశారని ధ్వజమెత్తారు. ఇది చాలా పెద్ద సామాజిక సమస్య అని చెప్పారు. మనం ఏ యుగంలో ఉన్నామని.. ఈ విషయంపై బీజేపీ నేతల వైఖరి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. మహేశ్వర్ రెడ్డి ఈ విషయంపై ముందు మాట్లాడాలని పట్టుబట్టారు. అసెంబ్లీలో సబ్జెక్ట్‌పై మాట్లాడే ఆలోచన బీజేపీకి లేదని అన్నారు. 22ఏ, ఫీజు రీయింబర్స్ మెంట్‌పై కచ్చితంగా చర్చిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

### ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఏమన్నారంటే..

అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌ను బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తప్పుబట్టారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఏమైనా ప్రత్యేక రూల్‌బుక్ పెట్టారా.. అని ప్రశ్నించారు. ఏ రూల్ ప్రకారం బీఆర్ఎస్ సభ్యులపై సస్పెన్షన్ వేటు వేశారని నిలదీశారు. బీఏసీ ప్రకారం సభ నడపాలని డిమాండ్ చేశారు. 22ఏ భూముల అంశంపై సభలో చర్చించాలని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పట్టుబట్టారు.

# బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్.. ఈ సెషన్ మొత్తం సస్పెండ్ చేస్తూ తీర్మానం

హైదరాబాద్, సెప్టెంబర్ 9:అసెంబ్లీ సమావేశాల తొలి రోజు నుంచే రేవంత్ ప్రభుత్వం నిర్బంధకాండ కొనసాగుతోంది. హామీల అమలుపై ప్రశ్నించినందుకు తొలిరోజే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడి చేయించింది. ఇవాళ మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనలపై నిలదీసినందుకు సభ నుంచి సస్పెన్షన్ వేటు వేసింది. 17 మంది బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేశారు. ఈ సెషన్ ముగిసేంత వరకు ఈ సస్పెన్షన్ కొనసాగుతోందని తీర్మానం చేశారు.

దీనిపై మిగతా బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. సభ లోపలే తమ నిరసనను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు.

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బుధవారం నాడు తమ ఎమ్మెల్యేలు ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానంపై చర్చకు అనుమతించాలని కోరుతూ బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ఇచ్చిన వాయిదా తీర్మానంపై వెచర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'వీ వాంట్ జస్టిస్' అంటూ సభలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పోడియం వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ సభ్యులపై సస్పెన్షన్ వేటు వేశారు.

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం.. రైల్వే మౌలిక వసతుల విస్తరణకు గ్రీన్‌సిగ్నల్..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: దేశంలో రైల్వే మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైల్వేలో అత్యంత రద్దీగా ఉండే ఏడు హైడెన్సిటీ కారిడార్లను నాలుగు లైన్లుగా విస్తరించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు సుమారు రూ.11 వేల కోట్ల విలువైన మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ అఫైర్స్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కేంద్రం తాజా నిర్ణయంతో ఢిల్లీ-హౌరా, హౌరా-ముంబై, ఢిల్లీ-ముంబై, ఢిల్లీ-గువాహటి, ఢిల్లీ-చెన్నై, హౌరా-చెన్నై, ముంబై-చెన్నై మార్గాల్లో ప్రస్తుతం ఉన్న రైల్వే నెట్‌వర్క్‌ను నాలుగు లైన్లకు పెంచనున్నారు.

ఈ కారిడార్ల ద్వారా దేశంలోని అనేక ప్రధాన నగరాలకు ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా ఐదు రాష్ట్రాల్లోని 14 జిల్లాలకు లబ్ధి చేకూరనుంది. దాదాపు 4,790 గ్రామాలకు రైలు కనెక్టివిటీ, రవాణా సామర్థ్యం పెరగనుంది. అలాగే సుమారు 56 లక్షల మంది ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం కలగనుంది. ఢిల్లీ-హౌరా మార్గంలో కాన్పూర్, ప్రయాగ్‌రాజ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్, పాట్నా, ఆసన్‌సోల్ వంటి కీలక ప్రాంతాలు ఉన్నాయి. ఢిల్లీ-ముంబై మార్గం మథుర, కోటా, రత్లాం, వడోదర, సూరత్‌లను కలుపుతుంది. ఢిల్లీ-చెన్నై మార్గంలో ఆగ్రా, గ్వాలియర్, ఝాన్సీ, భోపాల్, నాగ్‌పూర్, విజయవాడ వంటి నగరాలు ఉన్నాయి. ముంబై-చెన్నై మార్గంలో పుణె సహా పలు ముఖ్య ప్రాంతాలకు మెరుగైన రైలు కనెక్టివిటీ లభించనుంది.

కేంద్ర నిర్ణయంతో అత్యంత రద్దీగా ఉన్న ఈ మార్గాల్లో రైళ్ల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గనున్నాయి. అదనపు రైల్వే లైన్లు అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం ఉన్న మార్గాల్లో రైళ్ల సంఖ్యను పెంచేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ప్రయాణికుల రైళ్లతోపాటు సరకు రవాణా రైళ్లనూ మరింత సమర్థంగా నడపవచ్చు. ముఖ్యంగా ఈ మార్గాలు బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు తదితర కీలక వస్తువుల రవాణాకు అత్యంత కీలకమైనవి. మల్టీట్రాకింగ్ పనులు పూర్తయితే అదనంగా ఏడాదికి 27 మిలియన్ టన్నుల మేర సరకు రవాణా సామర్థ్యం పెరగనుంది.

# కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనలో మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి.. అంత ధైర్యం ఎలా వచ్చింది..

హైదరాబాద్, సెప్టెంబర్ 9:జులైలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనల్లో పాల్గొన్నందుకు ఓ విద్యార్థికి గ్రేటర్ నొయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీచేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా.. వాటిని ఉల్లంఘించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. 'ఓ విద్యార్థికి మేజిస్ట్రేట్ నోటీసు ఎలా ఇస్తారు.. విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అయినప్పటికీ ఓ మేజిస్ట్రేట్‌కు అలా చేయడానికి ఎంత ధైర్యం..' అని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మండిపడింది.

సుప్రీంకోర్టు తన అసాధారణ అధికారాలను ఉపయోగిస్తూ జులైలో జరిగిన సీజేపీ ఆందోళనలకు సంబంధించి విద్యార్థులపై నమోదైన అన్ని కేసులనూ కొట్టి వేయాలని ఈ నెల 1న ఆదేశాలు జారీ చేసింది. జులై 20 నుంచి 25 మధ్య దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఇకపై కొనసాగించరాదని, వాటిని అన్నిరకాలుగా క్లోజ్ చేస్తున్నట్టుగా పరిగణించాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా.. ఆ ఆందోళనలకు సంబంధించి భవిష్యత్తులో ఏ విద్యార్థిపైనా కొత్తగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని పేర్కొనేపథ్యంలో గ్రేటర్ నొయిడాకు చెందిన ఓ విద్యార్థి విషయంలో మేజిస్ట్రేట్ నోటీసు జారీచేసిన విషయాన్ని బిశ్వజిత్ భట్టాచార్య అనే సీనియర్ న్యాయవాది సుప్రీం న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనను దేశంలోని విద్యార్థులపై జరుగుతున్న ఓ ప్రయోగంగా అభివర్ణించారు భట్టాచార్య.




నేటి నిజం
సాహితీ కెరటాలు
website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 10-9-2026

# 'త్రివేణి' పుస్తకానికి మూత లేదు

పుస్తక సమీక్ష





-కె.ఎస్.అనంతాచార్య
9441195765






ప్రతులకు:
వారాల ఆనంద్
సెల్:9440501281

ఇప్పుడు కొందామని ఆన్లైన్ లో ఆర్డర్ పెట్టినా దొరకనిది సమయము. వేగవంతమయినది జీవితం. వేగానికి తగ్గట్టు వారాల ఆనంద్ ఖడే.... ఖడే కాఫీ అన్నట్లు 'త్రివేణి' కొత్త కవితా రూపంలో తమ కవితలు అందించారు.

కవితా ప్రపంచం గురించి ఆలోచిస్తే ఎవరికి వారు తమ తమ దైనందిన కార్యక్రమాలలో యాంత్రికతతో మనిషి ముందుకు సాగుతున్న కాలమిది. మనిషి అభిరుచి వున్నా తన స్వేచ్ఛను తానే ఉపయోగించుకోలేక ఒత్తిడి మధ్య విలవిలలాడుతున్నాడు. కొంత కవిత్వాన్ని ఆస్వాదిద్దామనుకుంటే దీర్ఘకవితలు అధిక నిడివిని కలిగి, ఓపికను పరీక్షిస్తున్నాయి. పరీక్ష నాళిక పరీక్షలో వీటికి జయాలు తక్కువ. ఈ మలుపులో చిన్న అందమయిన భావాల రూపం, చదువరులకు సులభం అనవసరపు పొడగింపు లేనిదీ మినీ కవిత. దీని రూపాలు చాలా వున్నాయి. హైకూ లు, నానీలు, మెరుపులు, రెక్కలు సేన్ర్యు ( senryu ) హైకూను పోలి వుంటాయి. ఇది మానవ స్వభావం బలహీనతలు లేదా రోజు వారి జీవితంలో హాస్య అంశాల పై దృష్టి పెడతాయి. లిమరిక్ (limerick ) ఐదు పంక్తుల కవిత. హాస్యకవితలో తేలికపాటి చమత్కారం వుంటుంది. డైమాంటే కవిత వజ్రం ఆకారం వుంటుంది. టంకా (Tanka) ) ఇది జపనీస్ కవితా రూపం. తెలుగులో వేమన పద్యం నాలుగు పాదాలను కలిగి ఒక ప్రతిపాదన చేసి రుజువు తెలిపి, తన ముగింపులో భేష్ అనిపించుకున్నారు.

కవిత్వ నిర్మాణం పై పట్టు, కవితా భాషతెల్సి, కవితా ధ్వని పరికరాల చేత, కవితాపంక్తుల సరిగమలు వినిపించిన వారాల ఆనంద్ గారిది విశిష్ట శైలి., సంప్రదాయం, నూటిదనం అనే ఇంధనం తో సరళమయిన గతుకు లు లేని రోడ్డు పైన స్పష్టమయిన వాహనం మీద లక్ష్యసాధనకు చేరుకోవడం ఆనంద్ స్టైల్. వాహనం దిగి హత్తుకోవడం కొనమెరుపు. దీని ఆధారంగా పుట్టిందే 'త్రివేణి' కవిత్వం. ఇందులో మూడు పాదా లతో మూడు పాయలై ముచ్చట ిస్తారు. ఒకటి గంగా, రెండోది యమునా మూడోది అంతర్లయగా సాగే సరస్వతి. అది ఒక అంతర్వాహిని. అల ఒకటి పైకి వచ్చి ఒక్క చరుపు చరుస్తుంది. మెరుపై మెరుస్తుంది.

POETRY IS WRITTEN TO SHARE THE IDEAS, TO EXPRESS EMOTIONS, AND FINALLY TO CREATE ENERGY.

ఒక్క కొత్త ఊహలు పంచుకోవడానికి, ఉద్వేగాల ప్రదర్శనకు సృజనాత్మక శక్తిని పంచే వాహకం కవిత్వం.

'త్రివేణి' చదివినప్పుడు **'మాట లు లేకున్నా మనసులు కలిసాయి అదే స్నేహం.'** ఇది చదివిన అనుభూతి అనుభవం రెండూ కల్సిన ఆనంద్ గొంతుక పాడుతూ

**'రోజూ కలిసేవాళ్ళం కాదు**
**కరచాలనం చేసేవాళ్ళం కాదు**
**అట్లని నాలుగు దశాబ్దాలుగా చేయి విడిచింది లేదు'** ఇది చాలా సింపుల్ గా నూటిగా స్పష్టంగా కనిపించిన లోక్ సత్తా నాయకుడు ఎన్.శ్రీనివాస్ వారాల ఆనంద్ ఎట్లా కలిసి వున్నారో వారి స్వాభావికతను సాత్వికంగా అందించడం ఈ త్రివేణిలో ప్రత్యేకత.

ఈ కవితా రూపం నేరుగా పాఠకుడి గుండెల్లో గుచ్చు కుంటుంది.

**'నవ్వుల్లో నజరానాల్లేవు/ కళ్ళల్లో ఆకాంక్షల**
**ఛాయల్లేవు/ ఇద్దరి నడుమ మబ్బులు లేవు'** పొరపొచ్చాలు లేని దోస్తానా శిలపై మెరిసే అక్షరం. లెక్కలు అధికారాలు స్నేహా నికి అడ్డు తెరలు కావు.

రెండక్షరాలు మనిషికి ఆక్సిజన్ అందించి నరాల్లో రక్త సరఫరా సరిగ్గా అవుతుందని ఆశ.

దానిని ఆనంద్ తన త్రివేణిలో...

**'రాత్రంతా చంద్రుడు భూమిని చదును చేస్తాడు**
**ఉదయాన్నేసూర్యుడు వెల్తురు విత్తులు నాటుతున్నాడు**
**పచ్చదనానిదే భవిష్యత్తు'** పచ్చదనం లేకపోతే మనమూ ఎండిన చెట్లమే.

> కవితా ప్రపంచం గురించి ఆలోచిస్తే ఎవరికి వారు తమ తమ దైనందిన కార్యక్రమాలలో యాంత్రికతతో మనిషి ముందుకు సాగుతున్న కాలమిది. మనిషి అభిరుచివున్నా తన స్వేచ్ఛను తానే ఉపయోగించుకోలేక ఒత్తిడి మధ్య విలవిలలాడుతున్నాడు.

పచ్చదనం అనే సృజన దానికే అందరూ సెల్యూట్ చేయాల్సిందే.

మరో త్రివేణిలో పచ్చదనానికి ప్రాణం పోస్తాను/శాస్త్రము ఎరిగి కళ్ళతో నీళ్ళు పోసి మొక్కను పెంచి వాయు కాలుష్యాన్ని తగ్గించమని అంటూ తన కవిత్వంతో మనో కాలుష్యాన్ని దూరం చేసుకోండి అని అంతర్లయగా సంభాషిస్తారు.

సున్నితత్వం, ఇతరుల అవసరాలని భావోద్వేగాల్ని అర్థం చేసుకునే సామర్థ్యం లేదా సులభంగా గాయపడే సామర్థ్యాన్ని సూచిస్తుంది. గాయపడిన పక్షిని చూసి వాల్మీకి రామాయణం రాసాడు. అలాగే గాయపడి సాన్నిహిత్యంతో ముడి వేసుకున్నప్పుడు పుట్టుకొచ్చేది కవిత్వం అని నిర్వచనం చెప్పారిక్కడ.

కవిత్వం ఉత్పత్తి కాదు ప్రక్రియ అసలే కాదు అట్లా అయితే అది కాల పరీక్షలో నెగ్గదు అని మొహమాటం లేకుండా చెప్పారు ఆనంద్.

**'నడక పరుగునందుకునే వేళ**
**కూలిపోయా కూడదీసుకున్నా**
**కవిత్వం నేనూ కూడబలుకున్నాం'.**

కవికా భయం లేదు. తన ఆరోగ్యం పట్ల స్పష్టత వుంది. ప్రనాళికా వుంది. కవిత్వమూ నేనూ కూడబలుక్కున్నాం అన్నారెందుకని? కూడితేనే కదా అక్షరాల ఆట ఆడేది. పాము మింగకుండా వైకుంఠపాళీలో విజయం కూర్చుకోనేది.

కాళోజీ తన అభిమాన కవి. ఆయన తన ఒక ఊపిరితిత్తి చెడిపోయినప్పుడు డాక్టర్ మీరు ఎక్కువ మాట్లాడితే రెండోదీ చెడిపోతుందని చెప్పినప్పుడు మాట మానేస్తే ఇప్పుడే చనిపోతా అన్నాట్ట కాళోజీ.

అట్లాగే ఆనంద్

**'ఆరోగ్యం జాగ్రత్త అదుంటేనే కవిత్వం అన్నారెవరో/ కవిత్వం ఉంటేనే/ ఆరోగ్యం'** అన్నాన్నేను అని ఒక త్రివేణి రాసారు. దానికి ఇక వ్యాఖ్య అక్కరలేదు.

సృజన మీద చక్కటి నిర్వచనాలు మనకు త్రివేణి ల్లో కనిపిస్తాయి.

**'హృదయంలోంచి ప్రకృతిలోకి**
**ప్రకృతిలోంచి హృదయం లోకి**
**పయనించడమే సృజన'.** సృజన గాలి లోంచి జన్మించదు, హృదయం లోంచే వికసిస్తుందని, అది హృదయానికి చేరుతుం ది అంటూ భావ గాంభీర్యతను ప్రకటిం చారు.

ఇందులో ఎలిజీలూ కనిపిస్తాయి.

**'హరి వెళ్తూ వెళ్తూ**
**సంచీలో పంచాగాన్నీ**
**చీకటిలో నన్నూ వదిలేసాడు'** తనకు నమిలకొండ హరిప్రసాద్ శర్మ గారికి వున్న సాన్నిహిత్యాన్నీ గుర్తు చేసుకుని రాసిందీ త్రివేణి.

ఇట్లా తడి తడి గా వుండి గుండెల్లో లయమయ్యేవి ఎన్నో.

ఇట్లా ఎన్నో స్నేహాలు బంధుత్వాలు, ఆత్మీయతలు, అనుబంధాలు ఒక్కరికే మాత్రం పరిమితం కాదనే విషయం బట్ట బయలు చేసారు.

ఒకానొక కాలపు కవిత్వ సహాయంతో ఆ కాలపు సామాజిక చరిత్రను, సామాజిక జీవుల స్పందనల వైశాల్యం లోతూ గ్రహింప వచ్చు. మరో త్రివేణిలో

'రెండు హృదయాలు/ఒకటే స్పందన/ అందమయిన అనుభవం' ఇది ఎక్కడో విని ఎక్కడో చదివి వుంటారు

ఇప్పుడు తన కలం నుంచి

'నాకు రెండు హృదయాలు కావాలి
ఒకటి ప్రేమను పంచడానికి
మరొకటి దుఃఖాన్ని దాచడానికి' ఇవ్వాల్టి ప్రపంచపు నడక తీరుకు ఇది అవసరం అని మనతో కూడా అనిపించారు ఆనంద్.

TODAY POETRY REMAINS AN IMPORTANT PARTS OF ART AND CULTURE

ఇదే అంశం 'త్రివేణి' లో తన అమ్మమ్మ వూరు వేములవాడ గురించి రాస్తూ

**'తెలంగాణా మొత్తం తడి బట్టలతో/ ప్రదక్షిణాలు చేసిపోతది / కష్టాల నుంచి ఆ ఊరు గొప్ప ఊరట'**

**ఇది దక్షిణ కాశి వేములవాడ మహిమ.**

**'ఇక్కడి మొక్కుల్లో భక్తులు**
**కోడెను మాత్రమే కాదు**
**తమ విశ్వాసాన్నీ కట్టేసి పోతారు'** అంటారు. వాహ్

కవిత్వం లో రీడర్ ఇక్కడ బాగా అందుకుంటాడు.

**'లష్కర్ లగెత్తుకొచ్చి**
**పోచమ్మ బోనమెత్తుకుంటది**
**పొద్దంతా తూలి తూలి**
**రాత్రంతా జాగారం చేస్తది'** ఇట్లా రాజన్న దగ్గరి విశ్వాసాలు మొక్కులు ఆచారాలు, సాంస్కృతిక అంశాలు ఎన్నో వున్నాయి ఈ త్రివేణి ల్లో.

**'రాములోడి పెళ్లి నాడు**
**రాజన్నను పెళ్లి జేసుకుంటారు**
**హరి హరులకు బేధం లేదు'** ఈ సంప్రదాయం మీద గతంలో డాక్యుమెంటరీ కూడా తీసారు వారాల ఆనంద్.

కవి మూడు వాక్యాల్లో ముక్కంటిని ఆయన లయత్వంలో జరిగే అంశాలను పట్టుకుని త్రివేణి లో వేముల వాడ గుండం లో మునకలు వేయించి ఒక పవిత్రతను ఆపాదించారు. అంతేకాదు పాఠకులకుఅనుభవాన్నీ అనుభూతిని అందిం చారు. కాలయాపన లేకుండా వారాల ఆనంద్ కవిత్వాన్ని చదువుదాం.

మనసున్న మారాజులు

ఇందులో అడుగు పెడితే కన్నీరు చెమర్చకుండా పుస్తకాన్ని మూయలేరు.

## శ్రావణం

చుక్కలు దర్వాజకుఎక్కినయంటే
కోళ్లుమేకల సంబరాలసమావేశం
ఆగకుంటా సాగుతది
ముప్పై రోజులు ఊరు ఊరంతా
చెప్పలేని భజనలు భాగవత సప్తలతో
మారు మోగుతది
గడ్డి పెరిగిన దూరల తీరు
గడ్డాలు పెరిగి వంగి పోతాయి
దీపెంతలనూనె కోసము
పగలు రాత్రి నాలుకలు చాపి
ఎదురుచూస్తయి హనుమాన్ల కాడ శునకాలు
సుఖంలేని వాళ్ళు కోరికలు
తీరని వాళ్ళు మాయలు మంత్రాలతో
దారులను భయపెడతరు
వద్దంటే పోలేని ఎండాకాలం
పొద్దుడు ఇప్పుడు ఎంత పిలిచినా రాడు
పొచ్చవ్వ, మైషవ్వలకు
మంత్ర తంత్రాలు తలుగుతాయని
పొలాల దాకా ముఖాలకు తాళాలేస్తరు
మర్లవడేటోళ్లను ఇద్దెలు మంత్రాల పేరుతో
ఊరెళ్ళ కొడతారు పటేం డ్లు
కక్కుడు బయలు జరాలతో
గరీబ్ గుడిసెలు గజగజలాడుతాయి
దవఖాండ్లకు పోయే ఐషతులేక
తాయతులతోనే మనసు నింపుకుంటరు
శని సోమార్లు ఒక్కపొద్దులు
ఇరవోసుకున్న తలలు
వాడవాడకు ఎదు రౌతయి
జంగమయ్యలకు బియ్యమిచ్చుడు
శివ భక్తుల మొక్కులు ఊపందుకుంటయి .
నెల రోజులు మూఢనమ్మకాలు
జడలు విప్పి తిరుగుతయి
ఒక దగ్గుదమ్ముల శవయాత్ర
ఊళ్లో బీమారోళ్ళని వణికిస్తది
శ్రావణం రోజులన్నీ
నిషా దెబ్బలకు,తాగిన తిట్లకు దూరమై
ఆడవాళ్లు ఖుషిగా నిద్ర పోతరు
ఆఖరి రోజు మరలా
పాత మనుషులుగా మారిపోయి
ఊరంతా మునుపటి నాటకమే మొదలవుతది.



-డా॥ ఉదారి నారాయణ
9441513666

## హిమాలయం పంపిన ఉత్తరం

హిమాలయం ఈరోజు
మంచుతో కాదు?
మనుషుల కన్నీళ్లతో తెల్లబడింది.
నదులు నీటిని మోసుకెళ్లలేదు
ఊళ్ల జ్ఞాపకాలను మోసుకెళ్లాయి.
ఒక చిన్నారి పుస్తకం
బురదలో తెరిచే ఉంది?
అందులోని అక్షరాలన్నీ
ఇంటికి తిరిగి వెళ్లే దారి అడుగుతున్నాయి.
ఒక తల్లి తలుపు దగ్గర కూర్చుంది,
తలుపు లేదు, ఇల్లు లేదు?
కానీ ఎదురుచూపు మాత్రం ఉంది.
వంతెన తెగిపోయింది,
కానీ మనుషుల మధ్య
చేయి మాత్రం ఇంకా తెగలేదు.
ఎక్కడో ఒక సొరంగంలో
రెండు ప్రాణాలు
చీకటితో మాట్లాడుతున్నాయి,
"వెలుగు వస్తుందా?" అని?
బయట
ఒక దేశం మొత్తం
వారి కోసం
ఊపిరి బిగబట్టి నిలబడింది.
ప్రకృతి ఎప్పుడూ
ప్రతీకారం తీర్చుకోదు?
మన తప్పుల్ని
మనకే తిరిగి చదివిస్తుంది.
హిమాలయం నిశ్శబ్దంగా అడిగింది,
"నన్ను జయించాలనుకున్నావు?
నాతో కలిసి బతకడం
ఎప్పుడు నేర్చుకుంటావు?"
నేపాల్ ఈరోజు
ఒక దేశం కాదు,
మనిషి గుండెల్లో పడిన ఒక చీలిక.
ఆ చీలికలోంచి
ఒక చిన్న వెలుగు వస్తోంది...
మనిషి ఇంకా మనిషిగానే
ఉన్నాడనే వెలుగు.



-షేక్ నసీమాబేగం
949044086

# "వెన్నెల గొంతులో నుంచి పాటగా వినిపించిన కవిత్వం"




> వెన్నెలను పంచిన ఆకాశం క్రమంగా చీకట్ల స్వాధీనంలోకి వెళ్లినప్పుడు నక్షత్రాలను వెతికిపెట్టి తిరిగి అందించే కవిత్వం ఆమెది.

కవయిత్రి నాగజ్యోతి శేఖర్ నిత్యం కవిత్వం కోసం తపించే తత్వం ఆమెది. ఆమె కవిత్వంలో కేవలం పదాల కూర్పు కనిపించదు. ఆమె అనుభూతికి అక్షర రూపంగా ఆమె కవితలు నిలుస్తూ వుంటాయి. పాఠకుల మనసును కదిలించే శక్తిగలిగిన కవిత్వాన్ని అందించటం ఆమె దినచర్యగా మారిపోయింది. ఈ కవయిత్రి తాను చూసిన దృశ్యాన్ని మాత్రమే చెప్పకుండా దాని వెనక దాగిన జీవిత సత్యాన్ని దర్శింపజేయటం ఆమె కవితల్లో ప్రత్యేకంగా కనిపిస్తుంది. సాధారణ పదాలకు అసాధారణమైన భావగాంభీర్యాన్ని అద్దడమే ఆమె సాహిత్య ప్రతిభగా కొనసాగుతోంది. వెన్నెలను పంచిన ఆకాశం క్రమంగా చీకట్ల స్వాధీనంలోకి వెళ్లినప్పుడు నక్షత్రాలను వెతికిపెట్టి తిరిగి అందించే కవిత్వం ఆమెది. ఈ కవయిత్రి పేజీలు పేజీలుగా నిర్వేదపు నదిని దాటుతున్న సందర్భంలో సృజనకావించబడిన గ్రంథమే 'చిగురించే పేజీలు' కవితా సంపుటి.

చీకట్లవెంట రాలిపోయే చుక్కల్ని చూస్తూ, ప్రకాశించే ధృవనక్షత్రంకోసం ఎదురుచూస్తూ **'మట్టిపాడే పాటని బోరుబావిలో పాతేసి / క్యారేజీల్లో ఉదయాలను కుక్కుతున్న / చెమట రాత్రులే అన్నీ...'** అని అంటున్న ఈ పక్తులు అందించే భావనలో చాలా అర్థాలు మనల్ని పలకరిస్తున్నాయి. ఇక్కడ చీకట్లు అనేవి కష్టాలు, నిరాశలకు ప్రతీకలు. ధృవనక్షత్రం స్థిరత్వానికి, దిశానిర్దేశానికి ప్రతీక. 'మట్టిపాడే పాటని బోరుబావిలో పాతేసి' ఇది చాలా శక్తివంతమైన ప్రతీకాత్మక ప్రయోగం. మట్టిపాడే పాట అంటే అది రైతు జీవితాన్ని, పండే పంటను, రైతన్న శ్రమను సూచిస్తోంది. పై పదాలలో చెమట రాత్రులు అనేది కష్టజీవుల నిరంతర శ్రమకు ప్రతీక. క్యారేజీల్లో అనే పదప్రయోగం ద్వారా పనికివెళ్లే కార్మికులు, ఉద్యోగులు, జీవనోపాధి కోసం పరుగులు తీసే కార్మికుల నీడలు మనతో మాట్లాడుతున్నాయి. ఈ కవితాభాగం సామాన్య మనిషి జీవితానికి ప్రతీకాత్మక చిత్రణగా నిలుస్తోంది. 'చెమట రాత్రులే అన్నీ' అనే ముగింపు సామాన్య శ్రమజీవి జీవితంలోని నిరంతర పోరాటాన్ని మనముందు వుంచుతోంది.

రాత్రి గడిచేలోగా వెలుతురు పిట్టల్ని చేసి దిగంతాల ఆవలికి ఎగరేసుకు పోయే ఒక స్వాప్నికుడి గురించి ప్రస్తావించిన 'స్వాప్నికుడు'కవితలోని పదాలన్నీ మమూలు పదాలు కాదు. మట్టిపొరల్లో అతడు చీమైదూరి నిర్మించిన సైకత కుటీరాలనుండి బయలుదేరిన ఒక శక్తివంతమైన రూపాలవి. ఒక భ్రమర గీతాన్ని రచిస్తున్న అతని ఏకాంతాన్ని భగ్నం చేయవద్దంటూ కవితలోని పదాలు కాపలా కాస్తున్నాయి. వెన్నెల్లో ఆకాశంవైపు చూస్తే చంద్రునిలో నదిలా ప్రవహిస్తున్న అతని చిరునామా, చనువుగా మన దగ్గరికి వచ్చి మన కళ్లకు వేకువ కాటుకను దిద్ది, స్వాప్నికుడి జగత్తులోని శాశ్వత బంధానికి ఆహ్వానాలు పలుకుతోంది. అతడు పచ్చటి కలల్ని పండించుకోవటానికి కాసింత స్థలాన్ని చదును చేసిపెట్టమని సూచిస్తున్న కవయిత్రి భావాలన్నీ ఓ కొండశిఖరం నుంచి విసిరేసిన వెలుగు బంతుల్లా మనము ఒదు గెంతుతూ ఆడుకుంటున్నాయి.

కవిత్వపుదారుల్లో కురిసి కురిసి మేఘాల మధ్య తానూ ఒక అందమైన హరివిల్లుగా మారిపోవటం, చదివి, చదివి పుస్తకంలోని పేరాలను స్వరాలుగా మార్చుకుని పాటగా వినిపించడం, నడిచిపోయిన నిన్నటికి, నడుస్తున్న నేటికి ఈ రెండింటి మధ్య కవిత్వంగా ప్రవహించడం... తన దినచర్యగా మార్చుకున్న ఈ కవయిత్రి భావాలన్నీ మరో నూతన ఉదయానికి స్వాగతం పలుకుతున్నాయి. 'ప్రయాణం / ఉదయాన్నే మొదలు పెడతాను / మరు ఉదయానికి గాని / రావాల్సిన వాక్యం రాదు...' అంటూ 'పట్టాలు తప్పిన రాత్రి' కవితలో తన సాహిత్య ప్రయాణాన్ని ప్రస్తావించిన కవయిత్రి, తనలాగే తీరని బరువును గుండెలపై మోస్తున్న పట్టాలతో రోజూ ఆమె సంభాషిస్తుంది. ఆమె ఈ ప్రయాణంలో పట్టలు తప్పిన రాత్రిని ఒక స్టేషన్ లో వదిలేస్తుంది. ఒంటరితనాన్ని మరచిపోవాలనుకుంటూ ఉదయపు బుగ్గలపై సిరాచుక్క పెట్టగానే ఆకుపచ్చ అక్షరాల సిగ్నల్ తలెత్తుతుంది. ఆ వెంటనే కవిత్వం తన వేగానికి సంకేతాలను అందజేస్తుంది. **'అప్పటికి గాని నిద్ర /కనుపాపల బెర్తు పై వాలదు / నే తీసుకున్న టికెట్ ఖరీదు / కవిత్వం...'** అంటూ చివరలో చాలా గమ్మత్తుగా తన తలుపుల్ని మూసుకున్న ఈ కవిత, మన జ్ఞాపకాల పట్టాల మీద ఎప్పటికీ ప్రయాణిస్తూనే వుంటుంది.

'ఇంకా రాస్తావా?' అంటూ అసహనంగా అడిగిన ఓ కరుకుతనానికి, పడక గదిలో కాళ్లు విరిగిన స్వప్నాలు, మంచం కోళ్లకు వ్రేలాడుతున్న దృశ్యాల మధ్య నిలబడి 'ఏం రాయవద్దా' అంటూ నిశ్చలంగా అడిగిన ఆమె మాటలకు అరల్లో దాచుకున్న పుస్తకాలు ఎర్రబడ్డ కళ్ళతో చప్పట్లు కొడుతున్నాయి. ఆ ప్రోత్సాహానికి దుప్పటి మడతల్లో విలపించిన ఆమె చేతి వేళ్లనుంచి కారుతున్న సిరాచుక్కలు అక్షరాలై, కలం, కాగితాన్ని ఆమె అందుకు నేలా చేస్తున్నాయి.

**'ఒక అసంపూర్ణ సంభాషణ'** కవితలో కవిత్వీకరించిన ఈ పద ప్రయోగా లన్నీ ఉన్నతస్థాయి యోగ్యతాపత్రాలను సగౌరవంగా అందుకునే స్థాయిలో వున్నాయి. **'కాళ్ళ కింద అంతా తవ్వేసుకున్నాక / పైపైకి రావాలంటే / నిచ్చెనేసేది ఎవరు / ప్రకృతిని హత్య చేశాక / పడే ఉరిశిక్షను / రద్దు చేసేదెవరు...'** అంటూ 'శిథిలాల అడుగున' కవితలో, మానవతప్పిదాలు చేసిన ఘోర ప్రమాదాల ఫలితాలను ప్రకటిస్తున్న ఈ కవయిత్రి,

పిట్టలు వాలని కాలుతున్న ఒక చెట్టుకు ప్రశ్నార్థకమై వేలాడుతున్న ప్రపంచాన్ని గొంతెత్తి పిలుస్తోంది.

స్ఖలించబడ్డ నిర్మల త్వాన్ని ఒకసారి స్వప్నించాలని, అమ్మపాల చుక్కంత నిద్ర వస్తే బాగుం డును...అని అనుకుంటోంది కవయిత్రి.సామ్రాజ్యవాదుల బాంబులపక్షి ప్రపంచ పటంపై అమాయక దేశాలను ముక్కున కరచుకొని ఎగిరిపోతున్న క్రూర దృశ్యాలను 'సామాన్యీకరణ' కవితలో చిత్రీకరిస్తూ **'రేపో మాపో మన పెరట్లోనూ / యుద్ధ విమాన మొకటి వాలుతుంది / అప్పుడక్కడ మొలిచే సెమ్మెట్రీలపై / పూలుంచేందుకు చేతులేవీ / మిగలక పోవచ్చు / ఎంత ఏడ్చినా గతాన్ని తవ్వేందుకు / భవిష్యత్తు ఉండకపోవచ్చు...'** అంటూ చిన్నారుల గాజుకళ్లపై పేరుకున్న క్షిపణి ధూళికణాలను చూపిస్తూ కవయిత్రి పలికిన ఈ మాటల నేపథ్యంలో ప్రపంచం పొడవునా ఓ రక్తపు నది శవాలను మోస్తూ దీనంగా ప్రవహిస్తోంది. 'ఇంకెవరికి...' కవితలో మాతృమూర్తి స్వరూప స్వభావాలను మరోసారి సారవంతంగా ఆవిష్కరిస్తూ... 'దుఃఖాన్ని పూడ్చిపెట్టి / నవ్వుగా మొలకెత్తడం / ఆమెకు తప్ప ఎవరికి సాధ్యం...' అంటూ కవయిత్రి చేసిన తీర్మానానికి, తన కొమ్మల మీద వాలిన పిట్టలన్నీ ఎగిరిపోయాక, గూళ్ళు చెప్పే కథల్ని వింటున్న ఓ ఒంటరి చెట్టు, దుమ్ముపట్టిన తన చిరునామా పలకను తుడుచుకుంటూ ఈ కవితలో దర్శనమిస్తోంది.

ఈ సంపుటిలో తీవ్రంగా ఆలోచింపజేసిన కవిత 'బర్త్ మార్క్'. ఇక్కడ 'బర్త్ మార్క్' అనేది శరీరంపై వుండే పుచ్చుమచ్చ మాత్రమే కాదు. పుట్టుకతోనే సమాజం మోపిన కులముద్ర కూడా. ఈ కవితలో 'అతడు ఖాళీ కంచాన్ని కడుపులో పెట్టుకుని తిరుగుతుంటాడు' అనే వాక్యం అతని ఆకలిని, నిరంతరం బాధిస్తున్న పేదరికాన్ని తెలియజేస్తోంది. జీవితమంతా ఆకలితో అల్లాడుతున్నా, అతనికి ఈ సమాజంలో న్యాయం జరిగే అవకాశం ఎప్పటికీ రాదనే భావం 'అతని టోకెన్ నెంబరు ఎప్పటికీ రాదు' అనే ప్రతీక ద్వారా గొప్పగా వ్యక్తమవుతోంది. 'మురికి కాల్వల చివరే కావ్యాలు రాస్తుంటాడు' అనే భావవ్యక్తీకరణ ఒక అద్భుతమైన రూపకం. అందరిలాగే జన్మఎత్తినాసరే తాను మాత్రం అత్యంత దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నాడు. బాధతో కార్చిన కన్నీళ్ళే అక్షరాలై కావ్యాలుగా మారుతున్న దృశ్యాన్ని ఈ కవిత ఆవిష్కరిస్తోంది. 'పాదాల నుండి పుట్టానని రాసిన బర్త్ సర్టిఫికెట్/ ఇంకా తగులబెట్టడు ఎందుకో?"...అంటూ ఈ కవితలోని ఈ చివరి పాదాలు పురుషసూక్తంలోని వర్ణవ్యవస్థను గుర్తుచేస్తున్నాయి. ఈ కవిత కేవలం ఒక మనిషి బాధను వర్ణించటానికే పరిమితం కాలేదు. ఆ బాధకు కారణంగా నిలిచిన సామాజిక నిర్మాణాన్ని నిలదీసి నిలువునా కడిగేసిన కవిత ఇది.

నాగజ్యోతిశేఖర్ కవిత్వంలో ప్రపంచాన్ని గొంతెత్తి పిలిచే ఒక ధ్వని వుంది. ఆమ్ల వర్షాలు కురుస్తున్నా ప్రవహించడం మానని నదిలా తన కవిత్వ ప్రవాహన్ని కొనసాగించగల సత్తువ ఆమె కలంలో వుంది. కవిత్వమనే నదినుంచి నిత్యం పదాలను వెలికితీయాలన్న తపన, కవిత్వాన్ని నిత్యం ఒక తపస్సులా కొనసాగించగల కోరిక... ఇవన్నీ ఆమెలో గాఢంగా వున్నాయి. దారి ప్రక్కన చెల్లాచెదురుగా వున్న స్వప్నాలను తన గుండెలోకి ఆహ్వానించి, వాటిని కవితలుగా తర్జుమా చేయగల ఆసక్తిని తన ఖాతాలో మెండుగా నింపుకోగల నేర్పరి ఈమె. రాయకతప్పని వాక్యాలకోసం సమయాన్ని తన సొంత ఖాతాలోకి అదనంగా జమ చేసుకోగల సమయస్ఫూర్తిగల తత్వం ఆమెది. ఈ కవయిత్రి ప్రత్యేకత ఏమిటంటే ఆమె కవిత్వం బాధను మాత్రమే నమోదు చేయదు; బాధకు కారణమైన వ్యవస్థను కూడా ప్రశ్నిస్తుంది.

ఆమె కవిత్వంలో ఆగ్రహం ఉంది?కానీ ఆ ఆగ్రహానికి మానవీయత తోడుగా ఉంది. నిరసన ఉంది..కానీ నిరసన వెనుక మార్పు పట్ల ఆకాంక్ష ఉంది. విషాదం ఉంది..కానీ విషాదం చివర శాంతి కోసం ఒక అన్వేషణ ఉంది. అందువల్ల ఆమె కవిత్వం నిస్పృహను పంచదు, నిస్పృ హను ఎదుర్కొనే చైతన్యాన్ని పంచుతుంది.ఆమె కవిత్వం చదివినప్పుడు మనం కవితను మాత్రమే చదవం?మన సమాజాన్ని చదువుతాం.ఆమె అక్షరాలను మాత్రమే చూ డం..అక్షరాల మధ్య దాగిన కన్నీటిని చూ స్తాం. ఆమె ప్రశ్నలను మాత్రమే వినం.. మనలోని మనస్సాక్షి స్వరాన్ని వింటాం. అదే ఈ కవయిత్రి కవిత్వానికి ఉన్న అసలైన శక్తి. అదే ఆమె సాహిత్యానికి ఉన్న ప్రత్యేకమైన గౌరవం. ఇంత గొప్ప కవిత్వాన్ని తెలుగు పాఠకులకు అందించి, ఎన్నో ప్రశంసలను తన ఖాతాలో లిఖించు కున్న నాగజ్యోతి శేఖర్‌కు హృదయపూర్వక అభినందనలు.



సాహిత్య ప్రపూర్ణ
-డాక్టర్ కె.జి. వేణు
98480 70084

# దువ్వూరి 'పానశాల' కవితా రమణీయకత

తెలుగు నాట ఒక తోటలో (వేనాడు రామచంద్రారెడ్డి గారిది) కూర్చుని పారశీక కవి శేఖరుడైన ఉమర్ ఖయ్యాం రచించిన రుబాయిలను తెలుగులోకి పద్యానువాదం చేసిన కవికోకిల, కృషీవలుడు దువ్వూరి రామిరెడ్డి గారు. నెల్లూరు జిల్లా గూడూరు లో 1895 నవంబర్ 9న జన్మించి పండితుల చేత "సింహ పురిసిరి" అనిపించుకున్నవారు.

యవ్వనారంభములోనే ఎన్నో కావ్యాలు రాసిన దువ్వూరి రామిరెడ్డి గారు ఉమర్ ఖయ్యాం రుబాయతులను అనువదించడానికి కారణం లేకపోలేదు. 1925 సంవత్సరం రామిరెడ్డి జీవితంలో తీవ్ర విషాదాన్ని నింపింది. భార్య శేషమ్మ వియోగం, మరుసటి సంవత్సరం కూతురు కుముదమ్మ మరణం తనను కుంగదీసినప్పుడు కాళిదాసు మేఘసందేశం, ఉమర్ ఖయ్యాం రుబాయిలే తనను పునరుజ్జీవింపజేశాయని స్వయంగా తానే చెప్పుకున్నాడంటే ఖయ్యాం తనను ఎంతగా ప్రభావితం చేశాడో అర్థం చేసుకోవచ్చు. 1924 నుంచే పారశీక కవితాధ్యయనం చేస్తున్న తనను ఈ విషాద సంఘటన ఉమర్ ఖయ్యాం రుబాయిలకు మరింత దగ్గర చేసింది. పారశీక కవితా ప్రాభవాన్ని తెలుగు వారికి అందించాలనే కాంక్షను రెట్టింపు చేసింది.

రామిరెడ్డి కేవలం ఉమర్ ఖయ్యాం రచించిన రుబాయిలను తెలుగులోకి అనువదించడానికే పారశీక భాషను నేర్చుకున్నాడంటే కవిత్వం పట్ల ఆయనకున్న నిబద్ధత ఏమిటో అర్థమవుతుంది. అనువాద విధానంలో తిక్కన, శ్రీనాథుడు అనుసరించిన స్వాతంత్ర్యాన్ని తాను అనుసరించినా అది మూలం కంటే భిన్నంగా ఉండదని చెప్పాడు. పారసీక జాతీయాలలో ప్రకటించిన భావం తెలుగులో కూడా స్ఫురించాలని అవసరమైన చోట మార్పులను, రసపోషణకు కావలసిన కూర్పులను చేశాడు.

తన వద్దగల 692 రుబాయీలను 108 వృత్తాలు ,17 తేటగీతులతో మొత్తం 125 పద్యాలలో తెనిగించారు.

ఉమర్ ఖయ్యాం రుబాయత్ లను అనువదించడంలో రామిరెడ్డి గారు ఒక పద్ధతిని అవలంబించారు. ఒకే విధమైన రుబాయీలను కొన్నింటిని వేరుచేసి వాటిలో మనోహరాలైన ఒకటి రెండింటిని మాత్రమే గ్రహించాడు. మరికొన్ని వాటిలో ఒక పాదం మాత్రమే కొత్త భావాన్ని వెల్లడించి తక్కిన పాదాలు చర్విత చర్వణంగా ఉన్న సందర్భంలో రెండు మూడు రుబాయీ లను కలిపి ఒక పద్యంగా రాశాడు. అట్లా రాసినవి సుమారు ఐదారు పద్యాలు మాత్రమే ఉన్నాయి.






'కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిన్ బొందరే......' అనే పోతన భాగవత పద్యాన్ని గుర్తుకుతెచ్చే పద్యమొకటి ఉమర్ ఖయ్యాం రుబాయికి రమణీయమైన పద్యానువాదమై రాజిల్లింది. పానశాలలో పురుడు పోసుకుని ప్రజల నాల్కలపై పరిఢవిల్లింది.

**'అంతములేని యీ భువనమంత పురాతనపాంథశాల; వి'**
**'శ్రాంతిగృహంబు; నందు నిరుసంజలు రంగులవాకిళుల్; ధరా'**
**'క్రాంతులు పాదుషాలు బహరామ్ జమిషీడులు వేనవేలుగాఁ'**
**'గొంతసుఖించి పోయిరెటకో పెరవారికిఁ జోటొసంగుచున్.'**

ఈ ప్రపంచం ఒక సత్రం. అందు పూర్వ సంధ్య, అపర సంధ్య అనేవి రెండు వాకిళ్లు. వేలకొలది రాజులు ఈ సత్రంలో కొంతకాలం సుఖాలను పొంది ఇతరులకు అవకాశం ఇస్తూ ఎక్కడికో వెళ్లిపోయారని ఇందులోని భావం. ఈ భూమి మీద శాశ్వతంగా ఉండే వాళ్ళు ఎవరూ లేరు. అందువలన ఉన్న కొద్ది కాలం వివాదాలు లేకుండా స్నేహంగా జీవించాలి అన్నది ఈ పద్యం మనకు ఇచ్చే హితోపదేశం. ఎంత చక్కటి జీవిత సత్యం. హృద్యమైన ఈ పద్యంలో అస్థిరమైన మానవ జీవితం దాగి ఉంది. ఇందులోని ఉపమానం అనుపమానం. పద్యం నడక అత్యంత మనోహరం. సారాంశం వేదాంతం. ఇటువంటి పద్యం ఒక్కటి చాలు మనిషి కళ్ళు తెరిపించడానికి. అహంకారమనే మత్తును దించడానికి.

నాకు భూమిపైకి రాకపోకల విషయంలో ఏమాత్రం స్వేచ్ఛ ఉన్నా వచ్చేవాడిని కాదు. వస్తే పోయేవాడిని కాదు. కుట్రలు కుతంత్రాలు గల్గిన మనుషులుండే ఈ పాడునేల మీద నా ఉనికి ఉండడవే నాకిష్టం లేదని వాపోయిన పద్యమిది. ఖయ్యాం సమకాలీనలైన మత చాందసవాదులు ఆయనను ఎంత బాధ పెట్టి ఉంటారో ఈ పద్యం ద్వారా తెలుసుకోవచ్చు. తనను వ్యతిరేకించిన వారిని తానూ వ్యతిరేకిస్తే ఏం బాగుంటుంది. తాను కవి కదా! అందుకే నేలను నిరసించాడు. అదే విషయాన్ని రామిరెడ్డి ఎంత రమణీయంగా అనువదించాడో చూడండి.

**'ఇలకు రాకపోకల నాకు స్వేచ్ఛయున్న'**
**'రాకయుందును; వచ్చినఁ బోకయుందు;'**
**'వీలువడునేని యీ పాడునేలయందు'**
**'ఉనికి పుట్టువు చావు లేకున్న మేలు.'**

ఉమర్ ఖయ్యాం వీధిలో సంచరిస్తున్నప్పుడు చూసిన ఒక దృశ్యం రుబాయిగా రూపాంతరం చెందిన సందర్భమిది. కుమ్మరివాడు మట్టి ముద్దను తొక్కుతున్న దృశ్యాన్ని చూసి మట్టితో సున్నింగా మందలించిన సన్నివేశాన్ని ఎంత సరళ సుందరంగా, పరమ రమణీయంగా రామిరెడ్డి అనువదించాడో మీరే చూడండి.

**'నిన్నటి రోజు కుమ్మరిని నేఁగనుఁగొంటి బజారువీథిలో'**
**'మన్నొక ముద్దఁజేసి మదమం జెడఁద్రొక్కుచు నుండ, వానితోఁ'**
**'దిన్నగ మందలించె నది దీనత "మెల్లఁగ నల్లఁ' ద్రొక్కుమో'**
**'యన్న, యెఱుంగవే నను? నొకప్పుడు నీవలె నందగాఁడనే!""**

నిరాకారుడైన భగవంతునివలె నిరాకారమైన మట్టి కూడా అందమైనదనే భావనను స్ఫురింపజేసిన పద్యరాజమిది. ఆలోచించి చూస్తే నిజమే అనిపిస్తుంది. అంతే కదా! మరి. భగవంతుని సృష్టిలో ప్రతిదీ అందమైనదే. కాకపోతే అది చూసే కళ్ళను బట్టి ఉంటుందంతే.

మరణం అంటే నాకు కించిత్తు కూడా భయం లేదు. నా భయం అంతా ప్రాణాలను మోయడంలోనే ఉంది అంటాడు. ఎందుకంటే ఆ ప్రాణాన్ని దేవుని దగ్గర వడ్డీకి బేరమాడి తెచ్చుకున్నాను. ఒకవేళ హఠాత్తుగా ఆ అప్పు తీర్చమని నా తలుపు తడితే అప్పటికప్పుడు బంగారు మాడల సంచులు ఆయన ముందు కుమ్మరిస్తానంటాడు ఉమర్ ఖయ్యాం . అప్పుడు ఆ భగవంతుడు అయినా ప్రాణాన్ని తీసుకుపోవడానికి ఆలోచించవలసిందే అనే మూలంలోని భావాన్ని రామిరెడ్డి ఎంత ముగ్ధమనోహరంగా అనువాదం చేశాడో చూడండి.

**'మరణభయంబు నాకు నణుమాత్రములేదు; మదీయ జీవ సం'**
**'భరణభయంబె' మిక్కుటము; ప్రాణము దైవము నొద్ద వడ్డి బే'**
**'హరమున" కప్పుగొంటి; ఋణమంతయు నిమ్మని తల్పు దట్టినన్'**
**'సరసర హేమనిష్కముల సంచులు ముందఱ విప్పిపోసెదన్'**

ఇలా రసవంతమైన ఉమర్ ఖయ్యాం రుబాయత్ లను సరళ సుందరంగా, సద్రసబంధురంగా, భావస్ఫోరకంగా అనువదించిన దువ్వూరి రామిరెడ్డి పానశాల ఒకవిధంగా పారసీక కవితా రసామృత పాన మహత్తేమిటో తెలుగు వారికి రుచి చూ నట్లయింది. అది తెలుగువారి హృదయం మీద చెరగని ముద్ర వేసింది.




-కె.మల్లేశం
9160396596


---




-డా॥రావి రంగారావు
9247581825


ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.
ఈ వారం వచన కవితల వర్క్ షాప్ లో విజేతల కవితలు చదవండి. అంశం "ఆరోగ్యం". -సంపాదకులు

## ఆరోగ్యం

స్వచ్ఛమైన గాలికి వెల కట్టి
ఏసీల్లో బందీలమయ్యాం...
స్వతహాగా ప్రవహించే జలామృతానికి
'మినరల్' పేరుపెట్టి
లాభాల సీసాల్లో ఆరోగ్యాన్ని బంధిస్తున్నాం...
అమ్మచేతి రుచినొదిలి
ఫాస్ట్‌ఫుడ్స్ మోజులో
రోగాలకు విందు పెడుతున్నాం...
కూల్‌డ్రింక్స్ మాయలో
నాలుకను మురిపించి
శరీరానికి శిక్ష వేస్తున్నాం...
సంపాదన వేటలో
ప్రశాంతత రెక్కలు నరికి
ఒత్తిడికి గూడు కడుతున్నాం...
అవసరానికి అన్నీ కొంటూ
ఆసుపత్రి ఐసీయూలో
ఆరోగ్యాన్ని అమ్ముకుంటున్నాం...

-సుభాషిణి వడ్డెబోయిన
63037 47030

## "ఆరోగ్యం ఆభరణం"

ఆరోగ్యం...
శరీరంపై వేలాడే ఆభరణం కాదు,
జీవితానికి వెలుగునిచ్చే ఆత్మదీపం.
నేడు ప్రపంచ ఆరోగ్యమే..
ఎఐజ బెడ్ మీద
అచేతనంగా పడివుంది
ప్రజా చైతన్యమనే
వైద్యుని కోసం.
ఆరోగ్యం మందుల దుకాణంలో
దొరికే వస్తువు కాదు,
మన ఆచరణలో రూపుదిద్దుకునే
అమూల్య రత్నం.
బంగారు గోపురాలు కట్టవచ్చు,
భూములూ భవనాలూ కూడబెట్టవచ్చు,
ఆరోగ్య అక్షయపాత్ర ఖాళీ అయితే
సంపదలన్నీ ఇసుక కోటలే.
ఉదయసూర్యుని తొలి కిరణం
నుదుటిని ముద్దాడినప్పుడు,
స్వచ్ఛమైన గాలి
ఊపిరిలోకి జారినప్పుడు,
ప్రకృతి ప్రసాదించిన ఆహారం
ఆత్మీయంగా పలకరించినప్పుడు,
ఆరోగ్యం మన గుండెల్లో
వసంతగీతం ఆలపిస్తుంది.
అతి రుచుల మత్తులోనో,
కృత్రిమ రంగుల మాయలోనో
ఆరోగ్యం లేదు.
భూమి ఒడిలో పండిన
సహజత్వంలోనే
జీవనామృతం దాగి ఉంది.
మనసు ప్రశాంత సరస్సులా నిలిస్తే
శరీరం శక్తి తరంగాలై విరుస్తుంది.
ఆలోచనలు స్వచ్ఛ గంగలా పారితే
ప్రతి కణంలో చైతన్యం చిగురిస్తుంది.
ఆరోగ్యం ఉంటే...
కళ్లలో వెలుగు ఉంటుంది,
అడుగుల్లో ధైర్యం ఉంటుంది,
మాటల్లో ఉత్సాహం ఉంటుంది,
జీవితంలో ఆనందం ఉంటుంది
ఎడారి కూడా
నందనవనమవుతుంది.
ఆరోగ్యం లేని రోజు
వసంతం కూడా శిశిరమవుతుంది.
ఆరోగ్యాన్ని కాపాడుకుందాం..
అది మనకు ప్రకృతి ఇచ్చిన
అత్యంత విలువైన వరం,
అత్యున్నత సంపద,
అమృత తుల్య జీవనాధారం,
ఆరోగ్యమే మనిషికి
అందమైన ఆభరణం.

-వి. వి. రావ్
9849559581

## విషపు వెన్నెల్లో ఆరోగ్యం

పండ్ల మార్కెట్లో పండ్లు
నిశ్శబ్దంగా మెరుస్తున్నాయి...
రసాయనాల బంగారు వెన్నెల్లో!.
మార్కెట్ నిండా అవే రంగులు
విషపు పసరును దిగ మింగుతున్న
చెమ్మ లేని మనుషుల బొమ్మలు!.
ఎంత తిన్నా నిండని ఆకలి,
కాలానికి ఏ రసాయనం పూశారో...
తెలిసీ తెలియక తిన్న శరీరానికి
ఆసుపత్రి మెట్లపై నలిగే ప్రాణాలు...
'ఆరోగ్యమే మహా భాగ్యం ' అన్నది
ఇప్పుడు ఒట్టి కపట నినాదం!
ప్రతీది కల్తీ అయిన చోట
ఆరోగ్యాన్ని దోచుకొనే దళారులున్న వేళ...
మనిషికి ఆయు వెక్కడిది?.
మొక్కకు తెలుసు...
మట్టి దాచుకున్న అమృతం ఏంటో!
మనిషికి తెలుసు...
తన కడుపును తానే
విష రసాయనాల శ్మశానంగా
మార్చుకుంటున్నాడని!.
చెట్టు నిలబడే ఉంది
ఓ పచ్చటి నిట్టూర్పుగా...
సరుకుల బజార్లో మనిషి కూలిపోతున్నాడు,
కల్తీ కాసుల కోసం
తన జీవాన్ని తానే బలి ఇస్తూ.!.
అమృతపు ఊటను చంపుకొని
విషపు విత్తనాన్ని నాటుకుంటూ
తన గోతిని తానే తవ్వుకుంటున్నాడు!.
మరి తవ్విన ఈ గోతులను
పూడ్చుకునేది ఎప్పుడు?
ఈ విష సంస్కృతి నుండి
మనిషి మారేదెప్పుడు?

-చల్లగాలి బాబురావు,
9941469728

## ఎక్కడ దొరుకుతుందో...

దేశం తెగులు కొంటు దయ్యింది,
నరనరాన కణం కణం
నిండిపోయిన
కల్తీ..
నాకెందుకో కనపడతాడు
పాడెక్కినట్టు ప్రతి శాల్తీ..
ఏం తిందామన్నా భయం భయం..
అభయ మిచ్చే ఇరవై అడుగుల
ఆంజనేయస్వామి కూడా
మోసాలను కనిపెట్టలేక
మౌనంగా చూస్తూ వుంటాడు..
తన ముందు పెట్టిన అరటి పండు తొక్కలో
విషాన్ని ప్రసాదంగా స్వీకరించలేక
తోక ముడిచి పారిపోతాడు...
అయ్యో..
ఆ గంపలనిండా
వగలు పోయే ఎర్ర తోలు ఆపిళ్ళు,
ఆకర్షించే ద్రాక్ష పళ్ళు..
నవ నవలాడే
దానిమ్మ గింజలు ఒలిచి చూస్తే
ఒళ్ళంతా రసాయనం
బుస బుస పొంగుతుందే..
తెల్లని పాలు కాటేసి మనిషిని
తెల్లవార్చుతున్న వార్తలు,
వింటే ఆరోగ్యం పొయ్యిలో జారి
కాలిన పాల పొంగు
కల్తీ నూనెలు..
రంగు చల్లుకున్న ఆహారం దినుసులు,
ఏం తినాలో తెలిని మనుషులు..
ఆరోగ్యానికి ఇక్కడ గ్యారంటీ లేదు..
ఏ షాపులోనూ అమ్మని సరుకు..
ఆ సరుక్కు ఇవ్వని వారంటీ ప్రాణా లొక్కటే..
ఒకటి మాత్రం నిజం...
మనిషిలో స్వార్థం నశించినప్పుడే..
ఆరోగ్యమనే
ఆరో ప్రాణం లభిస్తుందని మాత్రం చెప్పగలను...

-నేల పూరి రత్నాజీ
8919998753

## అందని ద్రాక్ష కాదులే...

ఉషోదయానికి
సూర్యనమస్కారాలు మరచి
ఎండినకొమ్మల్లా ఎముకలు
గుల్లబారుతున్నాయని
చిన్నబోతే ఎలా?.
ఉభయ సంధ్యల్లో భూమాతను
పాదాలతో ముద్దాడక
నడకను దుప్పట్లో కప్పేస్తూ
బి.పి, షుగర్ లెవెల్స్ కు
రెక్కలొచ్చాయని
విరుచుకుపడితే ఎలా?.
స్విగ్గీ, జోమేటాలు
నీ ఇంటి చుట్టూ భ్రమణాలు
చేస్తుంటే, హాస్పటల్ చుట్టూ
నా పరిభ్రమణాలు ఏమిటోనని
ల్లబోతే ఎలా?.
అసూయ పడగ నీడలో విశ్రమిస్తూ
సార్థం కవచాలతో చరిస్తూ
హృదయభారం
తరగని నిధిలా పేరుకుపోతుందని
నివ్వెరపోతే ఎలా ?.
మనసో దిక్కులో హృదయం మరో దిక్కులో
దేహం దిక్కులేనిదైన వేళ
రోగం చేర దీస్తే .
ఆరోగ్యాన్ని సిరులతో
తూకం వేసి మొగ్గలేదని
విలవిల లాడితే ఎలా?.
అంతరంగ చీకట్లను చీల్చే ధ్యానం
హృదయలయలను గతి
తప్పనివ్వని ఓంకారం
ప్రకృతి తో సహజీవనం
ఆరోగ్యానికి సంజీవనీ మూలికలే.
ఇవి కొండకోనల్లో దొరికేవి కాదు సుమా
హృదయ కుహరాన్ని
అనకొండలా పెనవేసుకున్న
అసూయా ద్వేషాల లతలను కూకటి వేళ్ళతో
పెకలిస్తే చాలు....

-మేడిశెట్టి సుభద్రా కృష్ణ
7396959347

## ఆరోగ్య విప్లవం

మందుల షాపుల సుదీర్ఘ క్యూలలో కాదు
మైదానాన సాగే అడుగుల స్పందనలో ఉంది
పరమౌషధం!
కాగితపు ప్రిస్క్రిప్షన్ల దయాదాక్షిణ్యం కంటే
స్వచ్ఛమైన నీటిబొట్టే దేహాన్ని నిలిపే ఆయువు
రహస్యం.
వ్యాపార మార్కెట్‌గా మారుతున్న శరీరంపై
వ్యసనాల విషవలయం అలముకోకూడదు,
ఆసుపత్రి అద్దాల వెనుక కారే
నిశ్శబ్ద కన్నీళ్ల కంటే
ప్రకృతి ఒడిలో పదునెక్కే శ్వాసే అసలైన జీవనం!
ల్యాబ్ రిపోర్టుల ముద్రల్లో చిక్కుకున్న
సంతకం కాదు ఆరోగ్యం,
అది అంతరంగ ఆత్మవిశ్వాసం రగిల్చే
అఖండ విప్లవం!
వెంటిలేటర్లు పోసే కృత్రిమ ఊపిరి కంటే
అమ్మ చేతి స్పర్శలోనే
ప్రాణవాయువు నాడి కొట్టుకుంటుంది.
దేహంలో దాగివుండే అహంకారమే
సామాజిక ఆరోగ్యానికి దాపురించే
పెద్ద క్యాన్సర్!.
నాలుక చిమ్మే విషం,
బాధ్యత మరచిన నడకలే
జీవితపు మనుగడను కూల్చే నిశ్శబ్ద శత్రువులు.
మంచి మాట మనసుకు
సంజీవనై ప్రవహిస్తుంది,
ఆర్ద్రమైన భావన ప్రతి కణంలో
పెన్సిలిన్‌లా పనిచేస్తుంది!
ప్రకృతితో మమేకమై ఒదిగిపోవడంలో,
తోటి మనిషిని ఆదుకునే ఆర్తిలోనే
జీవితం పరిపూర్ణ ఆరోగ్యపు వెలుగును
సంతరించుకుంటుంది!

-బూరెడ్డి రామకృష్ణారెడ్డి
7382546949

---

పుస్తక సమీక్ష

# జర్నలిస్ట్ డా॥ షేక్ హసీన రచన "తెలంగాణ అసెంబ్లీలో అతివలు"






ప్రతులకు:
షేక్ హసీనా
సెల్:

"తెలంగాణ సాధన కోసం, నాటితరం నుండి నేటి తరం మహిళలు సాగించిన పోరాటాలు నన్ను కదిలించాయి. స్వరాష్ట్ర సాధనకు నడుం బిగించిన నాటి మహిళా ఉద్యమ కారిణులు, ముందుకు కదిలిన తీరు నేటి తరానికి ఆదర్శంగా నిలిచింది. నాలుగు కోట్ల ప్రజల ఆత్మ గౌరవానికి సంబంధించి మహిళలు అస్థిత్వాన్ని కాపాడే బాధ్యత తెలంగాణ ప్రభుత్వం తీసుకోవాలి" అంటారు. **"తెలంగాణ అసెంబ్లీలో అతివలు"** (1952-2024) పతాక శీర్షికన జర్నలిస్టు డా॥ షేక్ హసీన వెలువరించిన తన రచనలో.

"అధ్యాయాలుగా రాజ్యాంగం, రాష్ట్రగీతం, సందేశాలు, నామాట, ప్రాంతీయ పార్టీలు, ఉద్యమ కారిణులు, నవ తెలంగాణ, ఎన్నికలు, జిల్లాలు, శాసన సభ్యులైన మహిళల మనోగతం, నూతన ఎమ్మెల్యేల కోసం చక్కటి ఛాయాచిత్రాలతో డా॥ హసీనా ఈ చారిత్రక నేపథ్యం సమాచార, విశ్లేషణా రూపంగా ప్రతిబింబింప చేసారు. రాష్ట్ర గీతం ఆవిర్భావం, పరిచయాల ఇంటర్వ్యూలు, నూనత సాధికారతకు సూచనలు ఎన్నో తెలంగాణ మహిళా లోక ప్రగతికి అవసరమైన మార్గదర్శక సూచనలు పొందుపరిచారు.

జర్నలిజం, ప్రవృత్తి, బోధన, రచన జీవన వ్యాసంగంగా చేపట్టిన సీనియర్ పాత్రికేయులు కావటంతో డా॥ హసీనా ఈ రచనలో సమాచార పారదర్శకత, వృత్తి సంబంధిత నిజాయితీ, ప్రతిభా సంపన్నత, తెలంగాణ మహిళా చైతన్యాన్ని ప్రదర్శించే కరదీపికగా ఈ పుస్తకం రూపొందింది. జర్నలిస్టుగా, నైతిక బాధ్యత కలిగిన పత్రికా రచయిత్రిగా డా॥ హసీనా ఏ రాజకీయ పార్టీకి, కులమత వర్గాకు అతీతంగా, స్వాతంత్ర్యానంతరం తెలంగాణ సీమలో పోరాటాలు, ఉద్యమాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, క్లిష్టతర సమస్యలు, గత ఏడు దశాబ్దాల చరిత్రను సంక్షిప్త సుందర రేఖా మాత్రంగా స్పృశించారు. చైతన్య శీలం గల ప్రతి మహిళా అభినందించవలసిన రచయిత్రి డా॥ షేక్ హసీనా.




-జయసూర్య
9440664610


---

# గ్రామీణ క్రీడా ప్రతిభకు మౌలిక వసతులు కల్పించాలి

క్రీడలు భారతీయ సమాజ జీవనంలో కొత్తగా ప్రవేశించిన అంశం కాదు. శతాబ్దాలుగా అవి మన సామాజిక, సాంస్కృతిక జీవనంలో అంతర్భాగంగా కొనసాగుతున్నాయి. రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాల్లో విలువిద్య, మల్లయుద్ధం, గుర్రపు స్వారీ, రథపందేలు వంటి క్రీడలకు సంబంధించిన అనేక ప్రస్తావనలు కనిపిస్తాయి. మహాభారత కాలంలో అత్యంత ప్రాచుర్యం పొందిన మల్లయుద్ధంలో భీముడు, బలరాముడు, జరాసంధుడు వంటి వీరులు ప్రావీణ్యం కలిగిన మల్లయోధులుగా ప్రస్తావించబడ్డారు. అప్పటి మల్లయుద్ధ సంప్రదాయం నేటి రెజ్లింగ్ రూపంలో ఆధునిక క్రీడా ప్రపంచంలోనూ భారతదేశానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.

నేడు కామన్వెల్త్ క్రీడలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లు, ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై భారత రెజ్లర్లు సాధిస్తున్న విజయాలు ఈ సంప్రదాయానికి కొనసాగింపే. అయితే భారత క్రీడా విజయాల వెనుక మరో ముఖ్యమైన వాస్తవం ఉంది. దేశంలోని అపారమైన ప్రతిభలో గణనీయమైన భాగం గ్రామీణ ప్రాంతాల నుంచే వెలువడుతోంది.

ముఖ్యంగా మహిళా రెజ్లింగ్‌లో వచ్చిన పరిణామం భారతీయ సామాజిక దృక్పథంలోనే మార్పుకు నాంది పలికింది. ఒకప్పుడు శారీరకంగా బలహీనమైనవారిగా భావించి మహిళలను కొన్ని వృత్తులు, క్రీడలకు దూరంగా ఉంచే సామాజిక భావజాలానికి మహిళా రెజ్లర్లు సవాల్ విసిరారు. హర్యానాలోని బాలాలి గ్రామానికి చెందిన ఫోగాట్ సోదరీమణుల ప్రస్థానం దీనికి చక్కటి ఉదాహరణ. మహావీర్ ఫోగాట్ తన కుమార్తెలకు రెజ్లింగ్‌లో శిక్షణ ఇచ్చి, గ్రామీణ సామాజిక పరిమితులను అధిగమించేలా ప్రోత్సహించారు. గీతా ఫోగాట్ కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం సాధించగా, బబితా ఫోగాట్ కూడా అంతర్జాతీయ వేదికపై పతకాలు సాధించారు. వారి విజయాలు కేవలం క్రీడా విజయాలు కాదు. బాలికలకు క్రీడల్లో సమాన అవకాశాలు కల్పించాలనే ఆలోచనకు బలమైన ప్రేరణగా నిలిచాయి.

ఈ మార్పుకు సాక్ష్యంగా సాక్షి మాలిక్ పేరు ప్రత్యేకంగా నిలుస్తుంది. రియో 2016 ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన ఆమె, ఒలింపిక్ పతకం గెలిచిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా చరిత్ర సృష్టించారు. ఆమె విజయం తరువాత దేశవ్యాప్తంగా బాలికల్లో రెజ్లింగ్ పట్ల ఆసక్తి మరింత పెరిగింది.

అయితే ఇలాంటి ప్రతిభను గుర్తించి తీర్చిదిద్దడంలో గ్రామీణ భారతం ఇంకా అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఆధునిక శిక్షణా కేంద్రాలు, సింథటిక్ ట్రాక్‌లు, ఇండోర్ స్టేడియాలు, స్పోర్ట్స్ సైన్స్ ల్యాబొరేటరీలు, ఫిజియోథెరపీ, పోషకాహార నిపుణులు, నాణ్యమైన పరికరాలు ప్రధానంగా నగరాలు, పెద్ద క్రీడా కేంద్రాల పరిధిలోనే అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్నప్పటికీ, సరైన శిక్షణ, పరికరాలు, పోషకాహారం, ప్రయాణ సౌకర్యాలు లేకపోవడం వల్ల ఎంతోమంది యువ క్రీడాకారులు మధ్యలోనే ఆగిపోతున్నారు.

ఇది కేవలం క్రీడా రంగానికి సంబంధించిన సమస్యగా చూడకూడదు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి దేశ క్రీడా భవిష్యత్తుకు పెట్టుబడిగా భావించాలి. ప్రతి మండలంలో బహుళ క్రీడా మైదానం, ప్రతి జిల్లాలో ఆధునిక శిక్షణా కేంద్రం, గ్రామీణ పాఠశాలల్లో ప్రాథమిక క్రీడా సదుపాయాలు ఏర్పాటు చేయాలి. పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో వేగం, బలం, సమన్వయం, సహనశక్తి వంటి సామర్థ్యాలను శాస్త్రీయంగా అంచనా వేసి ప్రతిభను గుర్తించాలి. స్థానికంగా శిక్షణ పొందిన కోచ్‌లు, ఫిజియోథెరపిస్టులు, పోషకాహార నిపుణుల సేవలను అందుబాటులోకి తీసుకురావాలి.

గ్రామీణ క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి మహిళలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. ఒక ఫోగాట్ కుటుంబం, ఒక సాక్షి మాలిక్, ఒక మేరీ కోమ్, ఒక నీర్జ్ చోప్రా దేశానికి పతకాలు అందించిన కథలు వేలాది గ్రామీణ యువతకు స్ఫూర్తినిస్తున్నాయి. కానీ ప్రతి గ్రామంలో దాగి ఉన్న తదుపరి ఛాంపియన్‌కు తన ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించాలి.

పల్లె మైదానాల్లో మట్టి వాసనతో మొదలయ్యే సాధనకు ప్రపంచ స్థాయి శిక్షణ తోడైతే, భారతదేశం అంతర్జాతీయ క్రీడా పటంలో మరింత బలమైన శక్తిగా ఎదగగలదు. మన ఇతిహాసాల్లో మల్లయుద్ధం నుంచి ప్రారంభమైన క్రీడా సంప్రదాయం, నేటి ఒలింపిక్ పతకాల వరకు కొనసాగుతోంది. ఇక తదుపరి దశలో నగరాలకే పరిమితమైన క్రీడా సదుపాయాలను పల్లెలకు తీసుకెళ్లడం, పల్లెల్లోని ప్రతిభను ప్రపంచ వేదికకు తీసుకెళ్లడం దేశ క్రీడా విధానానికి ప్రధాన లక్ష్యంగా మారాలి.




-సి. హెచ్.ప్రతాప్
77998 00773

## కాల మహిమ

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు...
ఒక్కోసారి కన్నెర్ర జేస్తుంది...
నిన్నటి వరకు నవ్విన కాలం...
నేడు కసిరినట్లుంది!
మనిషి మారలేదు, మనసు మారింది...
అందుకే కాలం కన్నెర్ర జేసింది...
స్వార్థంతో నిండిన చూపులు...
కుళ్ళుతో రగిలే హృదయాలు చూసి
కాలం కన్నెర్ర జేసింది!
పచ్చని పొలాలను కాంక్రీట్ చేసి...
చెరువులను పూడ్చిన మనిషిని చూసి
ప్రకృతి కన్నెర్ర జేసింది!
తల్లిని వృద్ధాశ్రమంలో వదిలి...
తాళి కట్టిన భార్యను అనుమానించినప్పుడు
కాలం కన్నెర్ర జేస్తుంది!
స్నేహం ముసుగులో ద్రోహం చేసినప్పుడు...
ప్రేమ పేరుతో మోసం చేసినప్పుడు
కాలం కన్నెర్ర జేస్తుంది!
లంచం కోసం చేయి చాచినప్పుడు...
న్యాయం కోసం నోరు మూసినప్పుడు కాలం కన్నెర్ర జేస్తుంది!
అధికారం చేతిలో ఉందని
పేదవాడి కడుపు కొట్టినప్పుడు...,
కాలం కన్నెర్ర జేసి శపిస్తుంది!.
కులం పేరుతో మనిషిని విడదీసినప్పుడు...,
మతం పేరుతో రక్తం చిందించినప్పుడు
కాలం కన్నెర్ర జేస్తుంది!
వరదలై ముంచెత్తుతుంది, కరువై మాడ్చేస్తుంది,
భూకంపమై కంపిస్తుంది,
అదే కాలం కన్నెర్ర జేయడం!
కాలం కన్నెర్ర జేయడం అంటే
ప్రకృతి కోపం కాదు....
మన కర్మలకు ప్రతిఫలం!
మనం నాటిన విత్తనాలే
నేడు ముళ్ళై మనల్ని గుచ్చుతున్నాయి...
అయినా కాలం కఠినమైనది కాదు...
తల్లి వంటిది, తప్పు చేస్తే దండిస్తుంది,
ఒప్పుకుంటే క్షమిస్తుంది!
కన్నెర్ర జేసిన కాలాన్ని శాంతపరచాలంటే...
మనం మారాలి...
మనిషిలో మనిషిని చూడాలి, మమతను పంచాలి!
చెట్టును నాటాలి... చెరువును కాపాడాలి...
పక్షిని ప్రేమించాలి...
ఆకలితో ఉన్నవానికి ముద్ద పెట్టాలి...
ఏడుస్తున్నవానికి భుజం కావాలి...
అహంకారపు కిరీటాన్ని దించి...
కలం పట్టిన చేతికి సింహాసనం ఇవ్వాలి...
అప్పుడు కన్నెర్ర జేసిన కాలమే,
కన్నీటిని తుడిచి కౌగిలించుకుంటుంది!
కోపంతో చూసిన కాలమే, ప్రేమతో నవ్వుతుంది!
కాలం కన్నెర్ర జేయడం ఒక హెచ్చరిక
మేల్కొనమని...
ఆ హెచ్చరికను విని మనం మేల్కొంటే,
రేపటి కాలం మనదే...
లేదంటే కన్నెర్ర జేసిన ఈ కాలం...
కనుమరుగయ్యే కాలాన్ని చూపిస్తుంది!!!

డా. ఆళ్ళ నాగేశ్వరరావు (కమల శ్రీ)
7416638823

## కణిక



సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123
నిర్వహణ:
-శ్రీమతి సత్య నీలిమ
సెల్: 95021 56813

## ఊహించని ఉత్పాతం

ప్రకృతి అందాలతో అలరారుతున్న
అందమైన దేశం
పకృతి ఒడిలో ఆదమరచి
నిదురపోతున్న మానవాళిపై
కలలోనైనా ఊహించని
వరద ఉత్పాతం విరుచుకుపడి
నిదురపోతున్న వారిని
సజీవ సమాధులను చేసింది
వారి ప్రాణాలను వరద బురదలకు
బలిదానం చేసింది
భవంతులను,ఊళ్ళు ఊళ్ళను
అమాంతం మింగివేసి
సమాధులను మిగిల్చింది.
ఏమిటీ వైపరీత్యం
ఏమిటీ విధివిలాసం
ఎక్కడ చూసినా ఏవో ఉత్పాతాలు సృష్టిస్తూ
మానవ తప్పిదాలను భరించలేక
పగబట్టిన కాలం కన్నెర్రచేస్తోందా
జనజీవనాలను అతలాకుతలం
చేస్తోందా.
వలస వచ్చిన దేశ విదేశీ జనాలు
విహారయాత్ర కోసం తరలి వచ్చిన
యాత్రికులు ఎక్కడెక్కడివారో బురదలో
కూరుకుపోయి మట్టిలో
కలిసిపోయారు
కుటుంబాలను తీవ్ర విషాదంలో
ముంచిపోయారు.
ఎంతో సాంకేతిక పరిజ్ఞానంతో
ముందుకు వెళుతున్న దేశం
ఇలాంటి వైపరీత్యాలను గుర్తించి
ఎలాంటి హెచ్చరికలు ఎందుకు
చేయలేకపోతోంది
జనజీవనాన్ని అప్రమత్తం చేసుంటే
ఇంతటి ప్రాణనష్టం కలిగేదా.
ఎవరు,తీసుకున్న గోతిలో
వారే పడతారన్న సామెతగా
స్వార్థంతో మానవుడు చేసే
తప్పిదాలు కూడా అతనికే
మరణ శాసనాన్ని లిఖిస్తున్నాయి
జెన్ జీ వ్యవహారాలు ఎంత వరకు తోడై
కదిలాయి
దేశదేశాలు కలసి ప్రగతికి
బాట వేసినట్టే
ప్రకృతి రక్షణకు పీట వేయాలి.

-కొలచన విజయ భారతి
హైదరాబాద్

## కన్నెర్ర జేసిన కాలం తుఫాను వెలిసిన ప్రశాంతత

మునులవోలె కొమ్మల జడలు
విరబోసుకుని తపోభంగిమలో
నిలుచున్న తరువులు..
వాటి ఆశ్రయంలో రక్షణ
పొందుతున్న జీవరాశులు!.
మదిని సాంత్వనపరిచే
మలయానిలయాలలో..
జలజల పారే జలపాతాల సవ్వడిని
ఆటంకపరుస్తూ
జనుల రణగొణధ్వని!.
ఆహ్లాద ప్రశాంత ప్రకృతిని భంగపరుస్తూ..
భక్తి పేరుతోనో,వేడుకల పేరుతోనో
గుమిగూడే జన సందోహాలు..
మేట వేసిన నిర్లక్ష్యానికి సాక్ష్యంగా
పాలిథిన్ కవర్ల గుట్టలు!.
మానవుల స్వార్థానికి,
ధనవ్యామోహానికి ప్రతీకలుగా..
జీవనదుల ప్రవాహానికి అడ్డుగా
కొండల గుండెలు పగులగొట్టి
కొద్ది జాగాలో కట్టిన
నిలువెత్తు భవంతులు..
కళ్ళముందే పేకమేడల్లా కూలుతూ..
కట్టుబట్టలతో, పిల్లాపాపలతో
నిండా ముంచెత్తే నీళ్లల్లో మునుగుతూ..
పునరావాస గడ్డిపోచ ఆధారానికై..
చిగురంత ఆశా పడవలో ప్రయాణాలు!.
విరిగిపడే కొండ చరియలు..
పోటెత్తిన నదీ ప్రవాహాలు..
జనజీవనాన్ని అతలాకుతలం చేస్తూ
విరుచుకుపడుతోన్న వాయు గండాలు..
తుఫానులు, సునామీలు,భూకంపాలు..
మానవ స్వయంకృతాపరాధాలకు
ప్రతిఫలాలు!.
ప్రళయం కాసింత సద్దుమణగగానే..
విహంగ వీక్షణలు,
ప్రచారార్భాటాలు, నష్టపరిహారాలతో
వెల్లువయ్యే కన్నీటి సముద్రాలకు
కంటితుడుపు చర్యలు..
పది చెట్లు కొట్టివేసి
పరిహారంగా
ఒక్క చిన్న మొక్క నాటినట్లు!.
సాంకేతి ఊహాగానాలననుసరించి..
ముందు జాగ్రత్త చర్యలు...
ముందస్తు ప్రణాళికలు..
ప్రక్షాళన చర్యలు చేపట్టకుండా...
వర్షం వెలిసిన వెంటనే
పరారయ్యే మబ్బుల్లా
ప్రజలు,ప్రభుత్వాలు!.
అందరూ తుఫాను వెలిసిన
ప్రశాంతతలోనే తృప్తిచెందుతూ..
మళ్లీ మరో ప్రళయం కబళించేదాకా!.

-చంద్రకళ.దీకొండ

## కన్నెర్ర చేసిన కాలం

మూల మూలను వెదికి కాలం
ప్రళయమై పగబట్టి తరుముతూ
కూల గొట్టుచు కుటిల కోటల
నేలమట్టం చేయుచుండగ కాలం!!.
పేలవమ్మై మనిషి మేధ పాలుపోక
కాలు చేతులు కదపలేక చేష్టలుడిగి
తలలు వంచి తలపులు మరిచి
నిలిచి ఉంటే చాలు ఇదే మేలు రాక!!.
అనుచు జనము అనిర్వృతితో
కనుచు మదిలో తాము చేసిన తప్పులు
ఎన్నియని ఎంచిన, భూమి కొలతకు మించి
కన్నులందే దృశ్య మాలికలై కదులుచుండె!!.
అహంకారంతో ఆక్రమణకు సమరం సాగిస్తూ
భయంకరమైన శస్త్రాస్త్రాలు విరామం లేకుండా
విచ్చలవిడిగా ఉన్మాదంతో విరివిగా వినియోగిస్తూ
అంతరిక్షాన్ని అగ్నిశిఖలతో ఆహుతి చేస్తూ !!.
పొందిన రాక్షస ఆనందం వికృత వినోదం
వందిమాగదుల చందన గందాదుల నీరాజనాలు
జయ జయ ధ్వానాలు జయ కేతన రెపరెపల
మధ్య జనాంతము యొక్క హితం గోచరించలేదే!!.
ధరణి గర్భంలో పోటెత్తిన అణుపాటవ పరీక్షలతో
పోటీ పడుతు, మేటిని నేనేనని, ఎవరికివారు
సాటిలేని సైనిక శక్తి మాదేనని విర్రవీగుతుంటే, కాలం
ఉపరితలంలో ఉత్పన్నం చేస్తోంది భూ ప్రకంపనలు!!.
మానవ మనుగడకు జీవనాధారమైన
ఆ సముద్రుడి కడుపులో ముడిచమురు
లక్షల బ్యారేళ్ళతో నింపుతూ
జలరాశిలో జీవరాశిని సర్వ నాశనం చేస్తూ.
సముద్రుడి గుండెల్లో భయంకరమైన క్షిపణులు
పేల్చి అల్లకల్లోలం సృష్టిస్తున్న పిశాచ గణాలు ,
సంద్రుని నడుముకు సముద్ర క్షిపణులు కట్టి
అడుగులు పడకుండా అడ్డుకుంటున్న మూఢులు!!.
అందుకే భూనభోఅంబుధులు ఆగ్రహించి,
సవాలు విసురుతున్న మానవ మేధకు
తన హద్దేమిటో చూపించాలని కాలమై కన్నెర్ర చేశాయి,
ఓ మనిషి నీ హద్దు తెలుసుకో, అందులోనే మసులుకో!!.

-కేశరాజు వేంకట ప్రభాకర్ రావు
62816 979 82

# డబ్బు - కీర్తి కథ!

భారతదేశంలో డబ్బుకి కొరత వుందని ఎవరన్నా అంటున్నారంటే అంతకంటే హాస్యం మరొకటి లేదు అని వికటాట్టహాసం చేస్తాడు మా మిస్టర్ క్లీన్. అందుకు కొన్ని ఉదాహరణలు ఆయన చూపించాడు. అవన్నీ మనమంతా రోజూ చూస్తున్నవే. చదువుతున్నవే. ముందు రాజకీయ నాయకుల గురించి పక్కన పెడదాం.

అలాంటివారిలో చాలామంది స్విస్ బ్యాంకుల్లో ఇంకా మరికొన్ని దీవుల్లో దాచుకుంటారు. అది ఎలా సాధ్యమో రకరకాల సినిమాల్లో చూపిస్తారు. కథలు నవలలు రాస్తుంటారు. అంతదాకా ఎందుకు – ఇప్పుడూ ఎప్పుడూ కాస్త కష్టం వచ్చినప్పుడల్లా కోట్లాది రూపాయల నోట్లు అచ్చొత్తిస్తారు. దానికి బంగారం నిల్వలతో పనిలేదు. అందుకే రూపాయి ధర ఎంతగా పడిపోతుందో సీరియల్ లా ఓ కాలమ్ నడుస్తుంటుంది. ప్రభుత్వాలు నోట్లు ప్రింట్ చేస్తారు. దొంగ నోట్లు తయారు చేసేవారూ అదే పనిలో వుంటారు. ఇంతకుముందు మనం కల్తీల గురించి, నకిలీల గురించి మాట్లాడుకున్నాం కదా! చివరికి మన డబ్బు కూడా కల్తీ అయింది. ఇది భారతదేశానికే పరిమితం కాదు. అదలా వుంచుదాం.

ఇప్పుడు ఏ.సీ.బీ, సీ.బీ.ఐ, ఈ.డీ ల వారి తర్వాత రకరకాల ఏజెన్సీల సీరియల్స్ నడుస్తున్నాయి. ఏకకాలంలో ఓ వ్యక్తికో, సంస్థకో చెందిన ఆస్తుల మీద అనేక చోట్ల, అనేక రాష్ట్రాల్లో దాడులు జరుగుతుంటాయి. చివరకు అటెండర్ మీద దాడి జరిగినా 50 సీ.ఆర్ తక్కువ దొరకటం లేదు. ఇంకా ఆ పైనున్న వారికి వారి అధికార స్థాయిని బట్టి వందలు దాటిపోతున్నాయి. ఐదు లక్షలో, పది లక్షలో దొరికాయంటే వారికి అవమానం. ఇప్పుడు మిలియన్స్ పోయి బిలియన్స్ లోకి చేరాయి. అవి ట్రిలియన్స్ గా మారటానికి ఎంతోకాలం అవసరం లేదు.

ఇవి ఉద్యోగాలు చేస్తున్నవారి సంగతులు. ఇంకా సంస్థలు వున్నాయి. రకరకాల వ్యక్తులు వున్నారు. వాళ్ళ సంపాదనకంటూ అంతూ పొంతూ వుండదు. బహిరంగ మార్కెట్లో వాటి విలువలు అంచనా వేయటానికి సంవత్సరాలు పడతాయి. అసలు ఇవన్నీ పక్కన పెడదాం. ఇందులో ఎవరికన్నా శిక్షలు పడుతున్నాయా?

డబ్బులు సంపాదించకపోవడం నేరం. అందుకు ఎవరైనా శిక్షలు అనుభవించాల్సిందే. అందుకే కదా ఇన్ని ట్యాక్స్ లు! గతంలో జుట్టు పెంచితే, పెంచకపోతే, మాట్లాడితే, మౌనంగా వుంటే రకరకాల పన్నులని జోకులు పేలేవి. ఇప్పుడు గాలి పీల్చాలన్నా పన్నులే కదా! ఇవి పైకి కనపడవు. అందుకే మా క్లీన్ గారు చెప్పినట్లు డబ్బుకి కొరత వుంది అని ఎవరన్నా అంటే అది డబ్బు సంపాదించడం చేతకానివారి మాట. ఇలాంటి గగ్గోళ్ళు ఇన్ని దశాబ్దాల నుండి మనం వింటున్నవే.






– పి.చంద్రశేఖర అజాద్
92465 73575

అసలు ప్రపంచం ఎందుకింతగా పతనమైంది? డబ్బు మనుషులను, దేశాలను, ప్రపంచాన్ని నడిపిస్తోందని మనుషులందరికి అర్థం అయిపోయింది కదా! ఇందుకు పరిష్కారం వుందా? ఇది మా ప్రశ్న."అరేయ్ పిల్లలూ! బతికుంటే బలుసాకు తింటాం అంటారు నిన్నటి తరం వారు. ఇప్పుడు నూడిల్స్, పిజ్జాలో, బర్గర్సో తింటాం అంటారు. ఇలాంటి ప్రశ్నలు అడిగితే చావగొట్టి చెవులు మూస్తారు. ఈ పని ప్రభుత్వాలు మాత్రమే చేయవు. ఎక్కడ డబ్బు పెరిగిపోతుందో అక్కడ అణచివేత వుంటుంది. నేను ఏదో మనసూరుకోక ఏదో ఒకటి అంటాను. దాన్ని సీరియస్ గా తీసుకోకండి రా బాబులూ!" అన్నాడు మా మెంటార్ మిస్టర్ క్లీన్!

××××××

మాటమీద నిలబడటం చాలా కష్టం. మనుషులంతా మూటల మీద, అదే డబ్బుల మూటల మీద వున్నారు కదా. మా మిస్టర్ క్లీన్ మళ్లీ వచ్చాడు.

''పిల్లలూ – మీరు కథలు రాయాలనుకుంటున్నారా?" అనడిగాడు.

"ముందు మీలాంటివారు చెప్పే కథలు వినాలి అనుకుంటున్నాం. అయినా నిన్ననే కదా మీరు వార్నింగ్ ఇచ్చారు. ప్రశ్నలు అడిగినా ప్రభుత్వాలే కాదు మనుషులు చావగొట్టి చెవులు మూస్తారని. అందులోనూ డబ్బున్న వాళ్ళు అని" అంది అన్య.

"చిన్న సవరణను మనం చేసుకుందాం. చావగొట్టి చెవులు మూయటానికి డబ్బున్నవాళ్ళే అవసరం లేదు. కండబలం, నోటి బలం వున్నవారు కూడా నిరంతరం తయారుగా వుంటారు. కాకపోతే వాళ్లు డబ్బున్న వారికోసం పనిచేస్తుంటారు" అన్నాడాయన.

''అసలు ఇలాంటి వారు డబ్బున్నవారినే చావగొట్టి చెవులు మూస్తే వారే డబ్బున్న వాళ్ళు అవుతారు కదా!" అన్నాడు విదు.

"ఇక్కడ మీకు మనుషుల తత్వం గురించి బోధించాలి పిల్లలూ! ఇలాంటి వారిలో చాలామంది కండలు పెంచుకుంటారు బుద్ధిని కాదు. వాళ్ళు డబ్బుని, మాటను పొదుపు చేయాలనుకోరు. సాయంకాలానికి మద్యం సేవించాలి. కోడినో మేకనో, ఇంకో జీవినో భోం చేయాలి. అలాగే ఎవరు మీటింగ్‌కి పిలిచినా గంతులు వేయాలి. పెడబొబ్బలు పెట్టాలి. పనిలో పనిగా ఎవరి మీద అయినా దాడులు చేయాలి. తర్వాత ఊచలు లెక్కపెట్టాలి. అంతేగాని రేపు అనేది ఒకటి వుంది అని అనుకోరు. అలా మానవ రోబోలను తయారు చేస్తుంటారు."

"అందరూ ఇలానే వుంటారా?" అన్నాను నేను.

"అందరూ ఎందుకు వుంటారు మేంగో? కొంతమందికి ముందుచూపు వుంటుంది. వాళ్ళు మద్యం తాగినా, గొడవలు చేసినా ప్రణాళిక వుంటుంది. లెక్కలు వేసుకుంటారు. డబ్బుని నిల్వ చేసి మూటలు కడతారు. ఆ రకంగా కొత్త యజమానులు అవుతారు. వారి కోసం ముందు చెప్పుకున్న జీవులు పనిచేస్తుంటాయి."

"వాళ్లు కళ్ళు తెరవరా?" అన్నాను.

"తెరవరు. తెరవనీయరు."

"మీ మేధావులు కూడా అంతేనా?" అంది అన్య.

"వాళ్లు మనుషులు కాదా! మామూలు మనుషుల కంటే మేధావులకు బలహీనతలు ఎక్కువ వుంటాయి అన్యా! ఇందులో రెండు మూడు రకాల వారు వుంటారు. శాలువాలకు, ప్రశంసలకు, చిన్నచిన్న అవార్డులకి మురిసిపోయేవారు ఒకరకం. మరోరకం వారు వీటికి లొంగరు. వారు మూటలు కడుతుంటారు. మాటల మూటలు కాదు. వీరికి వున్నంత ముందుచూపు ఇంకొకరికి వుండదు."

"అలాంటివారు డైరెక్టుగా సంపాదించుకోవచ్చు. వారికి పార్టీలు ఎందుకు? సంస్థలు ఎందుకు? అలాగే అభ్యుదయ ప్రీచింగ్స్ ఎందుకు?" అన్నాను.

"ఓ కుటుంబంలో ముగ్గురు వుంటే మూడు పార్టీల్లో చేరతారు. అంటే ఎవరో ఒకరు అధికారంలో వుంటారు. మనుషులకు డబ్బు మాత్రమే తృప్తిని ఇవ్వదురా, కాసింత కళాపోషణ వుండాలి. ఇలాంటివారు కీర్తి మూటలు కడుతుంటారు. నువ్వు అన్నట్లు ఎవరైనా సరే నేను సంపాదించుకుంటాను. ఇవన్నీ నా మనసునుండి రావడం లేదని చెప్పరు. అక్కడ చాలా పోటీ వుంటుంది. ఇక్కడా మొదలయ్యాక ఇంకో మార్గం వస్తుంది. మనం మాట్లాడుకోవాల్సిన విషయాలు చాలా వున్నాయి. ఇది సముద్రమంత విషయం" అన్నాడు క్లీన్.

"ఇంతకీ కథల గురించి?" అంటోంది అన్య.

''ఇవన్నీ కథలే. దాని గురించి వివరంగా మళ్ళీ మాట్లాడుకుందాం" అన్నాడు మిస్టర్ క్లీన్!

## కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది.
అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..
-సంపాదకులు

## బాల్యం-బరువే!!

మాతృభాషపై మమకారంలేమి
పరభాషపట్టుకై పరుగులేలో!
ఆటపాటల-ఆనందసమయాన్ని
బండెడుపుస్తకాలా!-బాల్యంలో!.
పసితనం మసకబారుతుందే
కసి,కర్కశంతో-కలంపైబలమేలో!
జీవితానికిఅనాదిగా-పునాదిబాల్యం
బరోసాఇవ్వాలి-తప్పాబరువేలో!.
పసితనం-విరబూసినపువ్వు
ఆప్యాయ్యతలఅమ్మఒడేతొలిబడి!
బుడి,బుడి నడకలతో-తడబడి
కావాలి ఆటపాటల-బాల్వాడి!.
గ్రేడులు,మార్కులు వేటలో
బాలగేయాలు బలిపశువులై!
అమ్మా,నాన్నల అజమాషి
గుడిలాంటిబడిలో-పిల్లల-నామూషి!.
వ్యాపారంవలలో-చదువు చేపయితే
కాసులగాలానికి-విద్యార్థులుబలికూడదు!
తొలిపొద్దుపొడుపులా-తొలకరతొలిచినుకులా!
పసిమనసులపసిడిపంట-రాలాలిమనఇంట!.
చిట్టిచేతులతో-మోయలేనిబరువులు
పసిమనసులముసుగులోగాయాలు!
బాల్యంబలౌతుంది-ప్రమాదపుకోరల్లో
భావిభారతఆశలు-అడియశలేనా!

-ఉరిటి లక్ష్మణరావు, 63012 49925

## మానవ తప్పిదాలు

అందాల ప్రకృతి ప్రకోపిస్తే
ప్రకృతి ప్రకోపం ముందు
ఎంతటి వారైనా తల వంచాల్సిందే...!
ముమ్మాటికి మానవ తప్పిదాలు
ప్రకృతిని వికృతి చేస్తోంది....!
అడవుల నరికి వేత,
కూర్చున్న కొమ్మనే నరకడం ఎందుకు?
పంచభూతాల కలుషితం
వాహన కాలుష్యం విజృంభణ,
పంట పొలాలను నామరూపాలు లేకుండా చేసి
భవనాలు నిర్మించడం వద్దన్నా
ప్లాస్టిక్ వాడకం...
ఇంత వికృతి చేస్తుంటే
మానవ మనుగడ ప్రశ్నార్థకం...
మరో వైపు
భూకంపాలు సునామీ
కరువు కాటకాలు అతి వృష్టి,
అనావృష్టి ఎదురైతే
సర్వం నేలమట్టం...!.
మానవత్వం మరచి మానవులు తమ స్వార్థం
పనులే ప్రకృతి సమతుల్యం
కోల్పోయేలా చేసి మానవాళి మనుగడకు ముప్పు
కోరి తెచ్చుకుంటున్నారు...!.
మేలుకో మానవా..
కాలుష్యాన్ని నివారించాలి
మొక్కలు నాటాలి
వర్షపు నీరు నిల్వ ఉంచుకోవాలి...
ప్రకృతిలో మనం
ప్రకృతిని మనం రక్షించు కోవాలి తిరిగి ప్రకృతి
మనలను రక్షిస్తుంది
ప్రకృతికి మానవాళికి
అవినాభావ సంబంధమే
ప్రకృతి తో కలిసి జీవించడం
ప్రకృతి సౌందర్యం, మానవాళి మనుగడ అన్న
విషయాన్ని మరవద్దు...!

-వలిపె విజయ సుధీర్
97046 56177

## శ్రామికుడు లేని జగం ఊహించగలమా?

తన రక్తాన్ని చెమటగా చిందించి
తన కండ బలాన్ని కొండంత అండగా భావించి
తన నరాలను ఉక్కు సంకెళ్ళుగా మార్చి
తన తనువులోని అణువణువును కరిగించి.
తన పొట్టలోని పేగులు తల్లడిల్లినా
జగాన ఉన్న జనం పొట్ట నిండడం కోసం
తను పస్తులున్నా..ఉపవాసంలా భావించి
అహర్నిషలు అలుపెరుగకుండా శ్రమిస్తూ...
రేయి పగలు నిత్యం పనిలో
తలమునకలయ్యే శ్రామికులు..
ఆకలి తీరడానికి పచ్చడి మెతుకులైనా
పంచభక్ష పరమాన్నాలుగా..తృప్తిగా భుజిస్తూ
బాహ్యసౌందర్యానికి మసైనా మట్టైనా
చందనలేపమోలే భావిస్తూ?.
చిరునవ్వే సిరులుగా, ఆయుధాలే ఆభరణాలుగా
అనునిత్యం ఆనందంతో శ్రమించే?
శ్రామికులు లేని జగాన్ని ఊహించగలమా?.

-పోచం లక్ష్మి నర్సయ్య, 99855 94644

## గురువుకు వందనం

క్షీరము నిచ్చేది ధేనువు
జ్ఞానము నిచ్చేది గురువు
దేవ గురువు బృహస్పతి
గురుదేవుడేప్పుడూ సరస్వతే!!.
అజ్ఞానం నుండి విజ్ఞానం వైపు నడిపించేది గురువు
మంచి మనిషిగా తీర్చిదిద్దేది గురువు
మంచిని బోధించేది గురువు
గురువు లేని విద్య గుడ్డి విద్య!!
విజ్ఞానం పంచేది గురువు
తన విద్యను ధారపోసేది గురువు
ప్రపంచంలో అన్నిటికీ రెండు కొమ్ములే ఉంటే
మూడు కొమ్ములు ఉన్నవాడు గురువు!!
గు=1 రు =2 వు =3

-దేవులపల్లి రమేశ్.
-9963701294

# సాహితీ పురస్కారాల ప్రదానం




సాహితీ పురస్కారాల ప్రదానోత్సవంలో పాల్గొన్న సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్ డాక్టర్ డా॥నందిని సిధారెడ్డి. వీసీ నిత్యానందరావు తదితరులు.

హైదరాబాద్, సెప్టెంబర్ 9:(నేటినిజం ప్రతినిధి): సాహిత్యకారులు చేస్తున్న అశేషమైన తన సాహిత్య ప్రయాణంలో లభించే పురస్కారం ఎక్కువ కాలం కీర్తివంతంగా వెలుగుతుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితలను ప్రోత్సహించే దిశగా తెలుగు వర్సిటీ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవా విభాగం ఆధ్వర్యంలో సాహితీ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. వర్సిటీ వీసీ నిత్యానందరావు అధ్యక్షతన జరిగిన సభలో సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ సాహితీ ప్రక్రియలలో విశేష కృషి చేసిన రచయితలు, కవులకు నగదు, శాలువా, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

సాహితీ పురస్కారాలను రచయితలు శశికిరణ్ కొమాండూరి, వంశీకృష్ణ, విశ్వనాథ శోభనాద్రి, పిన్నంశెట్టి కిషన్, సావిత్రి కోవూరులకు అందజేశారు.

# ఆదర్శనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్

హైదరాబాద్, సెప్టెంబర్ 9:చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరుగుతున్న ఎందరో మహానుభావులు మధుర స్మృతుల్లో భాగంగా గురువారం భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆచార్య డా॥ నాళేశ్వరం శంకరంకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పురస్కారాన్ని అందించి సత్కరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రమాదేవి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.




డా॥ నాళేశ్వరం శంకరంకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న అతిథులు.



# తల పైకెత్తి చూడు..!

కాళోజీ కవనలోకం
తెలం'గాన'మైన
బతుకు సమర
జీవన స్వరం.

ఆయన హృదయం
గాంధేయవాదమైన
ప్రేమోదయ దృశ్యం .

అక్షరాలన్నీ నిప్పు కణికలు
ఆలోచనలన్నీ శాంతి ధారలు
మాటలన్నీ మానవత్వ పాటలు
అడుగులన్నీ ప్రజాస్వామ్య కిరణాలు.

కాలం గుండెలో
శాశ్వత స్థానం ఏర్పరచుకొని
ప్రశ్నగా కనబడుతున్న కవి

కుల మత అసమానత
పొరలు చీల్చుతూ
అభ్యుదయమై
సమూహంలో సంచరిస్తున్న రవి.

ఆర్య సమాజ జ్ఞాన వెలుగుల్లో
మూఢనమ్మకాల అజ్ఞాన చీకట్లను తరిమి
అహింసా మార్గంలో నడయాడిన..
ఆయనే ఓ నవతరపు సంతకం..!
భవిష్యత్ తరాలకు ఆయనే
ఓ నవతరంగ కిరణం..!
నిజాం నిరంకుశత్వం
నెత్తిమీద ఆధిపత్య
నీడలా కమ్ముకున్నప్పుడు
ఆయన కలం సమరమయింది
మాటల తూటాల చప్పుడు
ప్రజల గొంతుకై
ఒక స్వేచ్ఛా శంఖమైంది..!.
"నా గొడవ"
తెలంగాణ పల్లె పల్లెనా
ప్రభాత గీతమై
బతుకమ్మ జానపదాల సంగీతమై
తీరొక్క పూల తీరుగా
అందమైన పాలపుంతయింది..!.
తెలంగాణ యాస
జగమంతా పరిమళిస్తూ
ఆకలి కడుపుల పలుకే
పద్యమై నిలిచింది..!.
బతుకు భాషే
తెలంగాణ శ్వాసై
ప్రపంచానికై కవిత్వం రాసింది..!
"జీవన గీత"కన్నీటి పాఠం
బతుకులు మార్చే
కలల పాటై
కదలికల బాటై
మట్టిమనసుల
భావోద్వేగాల సందేశమయింది
తెలంగాణ తొలి తరం
ఉద్యమ ఆత్మగౌరవ
తరతరాల నినాదాల్లో
ఆయన అక్షర ప్రభావం
విప్లవ శబ్దమై ఇంకా వినిపిస్తోంది..!
కాలం కర్పూరంలా కరిగిపోతుంటే
కాళోజీ మన గుండెల నిండా
ఓ జెండాల నిలబడ్డాడు
"అన్యాయాన్ని ఎదిరించినోడే
నాకు ఆరాధ్యుడంటూ.."
ప్రతి పదం ప్రజాపక్షమై
తెలంగాణ పోరు గాలిలో
ప్రేరణా దీపమై తిరుగుతూనే ఉన్నడు..!
అదిగో ఒక్కసారి..
తల పైకెత్తి చూడు
మండుతున్న సూర్యుడు
కాళోజీ లా కనిపిస్తుండు
తెలంగాణ గుండె నిండా
నవ్వుల సవ్వడై వినిపిస్తుండు..!

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
9394749536



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1879వ రోజు 'నేపాల్ వరదలు' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. **'నేపాల్ వరదలు'** అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.
-సంపాదకులు



***మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం***
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
*-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839*

## ఎందాక ఈ పయనం

మనిషి తలపెట్టిన
అభివృద్ధి ఫలాల్లో
మరీచికల జాడలింకా
జాబిలి వెలుగులను
మసకబారుస్తున్నాయా?!
పకృతి అనంతమైన శక్తి పీఠం
ఎక్కడికక్కడ బీటలకు
దారులేస్తున్నామా?!!
విజయపరంపరలో
పరాజితులంతా జీ
వికలను కోల్పోతుంటే?.
ఉన్నవాళ్ళమైన మనకు
నడుస్తున్న
భూమి పొరలు భద్రమేనా?!!
ాంచనీయ సంఘటనలుగా
చూడాలా???
మానవ సాంకేతిక పరిజ్ఞానానికి
ఇది సవాల్ గా చూడాలా?.
నిష్ణాతులైన
బయోలాజికల్ నిపుణులు
లోగుట్టును విప్పి చెప్పాలి
లేకుంటే మానవ మనుగడకు
భవిష్యత్తు ఏదీ?.
అనేక సవాళ్ళు
విసిరిన ఈ ప్రళయం
భూతాపం
ఎందుకు పెరుగుతుందో?!
అందరి కళ్ళముందున్న
కనిపించే సత్యం.
అతి వేడికి చలికి
ఆశ్రయ పరికరాలు
ఒక్కో చెట్టు కూలిపోతుంటే
భూ ప్రపంచానికి శ్వాసనాళాలు
ఊపిరి బిగబట్టుతుంటే
ఒక్కో గుట్ట చెదలు పట్టిన విధంగా
తునా తునకలై పోతుంటే
గాలి నీరు భూమి
కాలుష్యం కోరల్లో చిక్కి
విలవిల లాడుతుంటే.
ఈ ప్రకృతి
వాడిపోతున్న పూవై
పరిమళించే
స్వప్నాన్ని కోల్పోతుంటే!.
ఎందాక ఎందాక ఈ పయనం
ఈ ప్రపంచంలో
సవ్య మార్గంలో
బతికే పరిస్థితులు ఉన్నాయా?!
విచ్చలవిడి తనం
విధ్వంస యుద్ధోన్మాదం
గాలిలో తిరుగాడే
కనబడే చిక్కని దోమలా
మన సౌభ్రాతృత్వం సమానత్వం
ప్రేమతత్వం కొండెక్కి వెక్కిరిస్తూంటే.
భూమి ఉగ్రతాపానికి గురౌతున్నా
ఏవీ గతకాలపు మలయమారుతం
ఝుంఝుంరావాల
సమీరాల సవ్వడులు.
ప్రపంచవ్యాప్తంగా
అనాగరిక విషసంస్కృతిలో
మునిగిన మహా సముద్రాల ఘోష.
ఎల్ నినో మండే సూర్యుడికి
చంద్రలేఖల
ాంబర కిరణాల జాడ
చూపలేకున్నాం.
ఒక్కో హిమనదం
ఉన్నపళంగా కరిగి
మహాశివుని జటాజూటంలోంచి
జారిపోతుంటే
ఆపే పచ్చని శక్తి ఎక్కడా?!!.
ఎన్నో ప్రశ్నలు
ఎన్నో చిక్కుముడులు
నేపాల్ వరదల్లోనే కాదు
ప్రతీ జలఖడ్గంలో
జీవిడిసిన వారి
పవిత్ర ఆత్మలకు
నివాళులు అర్పించాలంటే.
నీరునూ నిప్పునూ
గాలినీ అడవినీ
అవనినీ నింగినీ
మహా పంచభూతాల సంరక్షణకు
జగతి మెచ్చేలా పాలకులంతా
పవిత్రమైన కలశపూజ చేయాలి
ప్రకృతి ఆరాధనలో లీనమవ్వాలి.
**-ఏడెల్లి రాములు**

## ప్రకృతి విలయం

మనిషి
ధనం, మానం, ప్రాణం, ప్రాంగణం
ప్రకృతి ప్రశాంతంగా
ఉన్నంత వరకే భద్రం.
ప్రకృతి కన్నెర్ర చేసిందంటే
ఒకతూరి మహిపై
మానవ మనుగడ సర్వం ఆవిరి
ప్రకృతికి కలిగిస్తే విఘాతం మితిమీరి
మనిషి జీవితం
కుక్కలు చింపిన విస్తరి
నేపాల్ వరదలే సాక్ష్యం మరి.
టిబెట్ నుంచొచ్చిన
మెరుపు వరదల పర్యవసానం
భోటేకోశీ
త్రిశూల్ నదులు
దాల్చి ఉగ్రరూపం
నువాకోట్ ధాడింగ్ జిల్లాల్లో
సృష్టించె భీబత్సం
ఊళ్లు, బ్రిడ్జిలు, ప్రాజెక్ట్లు
కొట్టుకుపోయెనమాంతం
భారీ మొత్తంలో జరిగింది
ప్రాణాల, ఆస్తుల నష్టం
ప్రకృతి విలయానికి
నేపాల్ అతలాకుతలం
గ్లేసియర్లు కరికి
భారీ వర్షాలు రావడమే కారణం
విదేశీయులనూ వదలలేదీ
ప్రకృతి విలయం.
మానవాళికి
ఇది ఒక హెచ్చరిక సందేశం
ప్రకృతిని కాపాడుకోమన్న
గట్టి సూచనం
కడలులు పొంగకుండా
కొండలు కుంగకుండా
కరువులు రాకుండా
కాపాడుకోవాలంటే
తక్షణం పర్యావరణాన్ని కాపాడటమే
అందరి కర్తవ్యం.
**-జె.వి.కుమార్ చేపూరి**

## తక్షణ కర్తవ్యం

ఒళ్ళు విరిచె హిమాచలం
భళ్ళుమంది నదీజలం
ఉలిక్కి పడిన నేపాళం
ఊళ వేసిన ప్రకృతి గళం
ఉగ్రమయ్యే జల ప్రవాహం
ఆక్రందించే జన సందోహం
ఊహకందని భయానకం
ఊహించని ప్రాణ నష్టం
సమస్తం కోల్పోయి దీన వదనం
అక్కున చేర్చుకుందాం తక్షణం
"సొంత లాభం కొంత మానుకు
పొరుగు వానికి సాయ పడవోయ్"
గురజాడ బోధన శిరోధార్యం
మన వంతు సేవ అందించడం
మనందరి కర్తవ్యం .
**-రామకృష్ణ చంద్రమౌళి**

## అనుకోని ప్రకృతి విపత్తు

జీవరాశిలోనే అత్యంత
ప్రమాదకారి మానవాళి
వారి ప్రమేయమున్నంత మేరకు
కలుషితమూ కాలుష్యమే.
చర్యకు ప్రతిచర్యలా
మానవ
తప్పిదాల ముప్పులే నేపాల్ లో
లాంగ్ టాంగ్ లిరుంగ్ శిఖరం వద్ద
హిమానీనదం విరిగిపడి
వచ్చిన మెరుపు వరదలు.
వాతావరణ మార్పులే
భూగోళం వేడెక్కడమే
బోటేకోషి నదిలో నీరు
ఒక్కసారిగా ఉప్పొంగడం.
ఊళ్లకు ఊళ్లు బురద నీరులో
నిట్ట నిలువునా ముంచేసింది
ప్రాణ నష్టం ఆస్తి నష్టం అన్నీ
వ్యవస్థల లోపాలను
ఎత్తిచూపినట్టే ఉన్నది.
ప్రభుత్వాలు శాశ్వత చర్యల కన్నా
కంటి తుడుపు చర్యలకే పరిమితమై
చోద్యాలు చూస్తున్నవి.
వేల మంది నిరాశ్రయులైన వేళ
పొరుగు దేశాల ఆపన్న హస్తాలను
నిరాకరించడం కూడా సబబు కాదు
స్వాగతించాలి సత్వరమే బయటపడాలి.
అభివృద్ధి కొరకై అనేక దేశాలు
కలిసిమెలసి అడుగులేసిన విధంగానే
ఆపదలలో ఒకరికొకరు ఆదుకోవడానికి
ఎక్కడికక్కడ ప్రాంతీయ విపత్తు
నిర్వహణలు కూడా తోడైతే
సమర్థవంతంగా సమస్యలను ఎదుర్కొని
ప్రగతి వైపు పటిష్ట ప్రయాణం.
**-నగునూరి రాజన్న**

## పీడకలలు!

వరదలు బురదలు
కన్నీటి గాథలు
మరపురాని పీడకలలు
ఆగని గాలింపులు
శోధింపులు
ఈపాపం ఎవరిది!?.
కొండల్లో చిన్నారి కూన
తడిసి ముద్దయిన తీరు
ఆనందనందనవనం
నేడు అశోకవనంలో సీత!.
వేలల్లో మరణాలు
జాడలేని జనాలు
మానస సరోవర యాత్ర
జీవుల అంతిమ యాత్ర!
గరుడపురాణం లో వర్ణన
నేడు కట్టెదుట!.
డ్రాగన్ కుతంత్రాలు
రాక్షసుల విజయం!.
ఆదుకోవాలి విష్ణు పరమేశులు!
తిలాపాపం తలాపిడికెడు
పరిహసిస్తున్న విజ్ఞానం
చేతులుకాలాక
ఆకులు పట్టుకున్న చందం
భారత్ కీ ఉంది ముప్పు
పదే పదే చేస్తున్నాం తప్పు.
హిమవంతునికివ్వాలి విశ్రాంతి
లేదంటే దక్షయజ్ఞ విధ్వంసం
ఈపాపం ఫలితానికి బలి
భవితలో ఉండదు యువత
ముక్కుతూ మూలుగుతూ వృద్ధులు!.
**-ఎ.రాజ్యశ్రీ**

## సప్త పదులు



ప్రక్రియా సృజనకర్త:
**సుధామ**
సెల్:9849297958

గీతాలు
సంగీతాలు

జానపదాలు
జనజీవన స్రవంతిలో
ఉద్భవించిన
అద్భుతాలు
**-ప్రసాద్ రావు,**
విజయనగరం.

వెతుకు,
ఉతుకు,

ఏది చేసినా
గడవాలి
మన
బ్రతుకు.
**-చెరుకుపల్లి**
**గాంగేయ శాస్త్రి,**
రాజమండ్రి

బాధలు
గాథలు

మనము
అనుభవించే
కష్టసుఖాలే
అవుతాయి
కథలు
**-విజయకుమారి**
**ముదిగొండ**
విజయవాడ,

రావాలి
పోవాలి

ఒకరినొకరు
అర్థం చేసుకునే
బంధువులు
కావాలి
**-పంతుల**
**లలిత(నీలాంజన)**
విశాఖపట్నం..

సొరకాయ
బీర కాయ
రసాలు
తీసుకుంటే
బాగా పనిచేస్తుంది
గుండెకాయ
**-అల్లంరాజు రాధా**
**కుమార్**
హైదరాబాద్

వలయం
విలయం

ఊళ్లను
ప్రజలను
కబళించింది
నేపాల్ ప్రళయం
**-అడ్డా సత్యవేణి."సత్య"**
తణుకు

సిద్ధి
బుద్ధి

హృదయసంస్కారంతో
మాట్లాడే మాటల్లో
ఉంటుంది
వాక్శుద్ధి
**-తాళ్లపల్లి భాగ్యలక్ష్మి**
**ఝాన్సీ**

వేదం
నాదం

లయబద్ధంగా
గానం చేస్తుంటే
రాదా
మోదం..
**-నీలాంజన**
విశాఖపట్నం

నాడు
నేడు

జగతిలో
తగ్గదు
గురువు విలువ
ఏనాడు.
**-డి. షాహినా**
గుంతకల్.

అష్టపది
ఇష్టపది
తెలుగు వెలుగును
ప్రజ్వలించే
ప్రయత్నమే
సప్తపది
**-మోదుగ**
**బాలసుబ్రహ్మణ్యం**
గుంటూరు

# సమాజ చరమాంక దశని చిత్రీకరించిన కావ్యం

**"నువ్వున్నది ప్రపంచ సంతలో!**
**ప్రతిదీ వ్యాపార వస్తువైన వాణిజ్య సముదాయంలో!**
**పుట్టుకే అవక తవకయినప్పుడు**
**ఎన్ని నక్షత్రాలు బలిదానం చేస్తే**
**వెలిగిన రాత్రి నీదవుతుంది?**
**బ్రతుకు నిండా నమన్యల సాలెగూళ్ళే!**
**తాకి చూడాలనుకోకు**
**నీకు నువ్వే కనవడకుండా పోతావ్!"**

ఇంత ఖచ్చితంగా ఏలూరి నాగేంద్రరావు మనల్ని హెచ్చరిస్తున్నాడంటే ప్రస్తుత కన్స్యూమరిజం సమాజాన్ని తను ఎంత కాచి వడపోశాడో తెలుస్తుంది. కమ్యూ నిజం నుంచి కన్స్యూమరిజం దాకా తను చేసిన సాహిత్య ప్రయాణమే ఈ చరమాంక దశ కవిత్వాన్ని అంతిమంగా పరికిస్తున్నది.

సాహిత్యంలో కొత్తగా వస్తున్న సిద్ధాంతాలలో కన్స్యూమరిజం కూడా ఒకటిగా మనం గమనించాలి. కమ్యూనిజం నుంచి కన్స్యూమరిజం దాకా జరుగుతున్న వ్యవస్థల పోకడల్ని ఏటూరి నాగేంద్ర పట్టించుకున్నంతగా మరెవరూ పట్టించుకోలేదని ఈ కవితా సంపుటిలోని ప్రతి ఖండికా చాటి చెప్తుంది.

వినియోగదారుల వాదాన్ని సాహిత్యపరంగా చూసినప్పుడు కవుల హక్కులు, ఉన్నతీకరణ మార్గాలని ఎలా కాలరాస్తున్నారో చూస్తే ఆశ్చర్య పోతాం. ఒక రచనకి దక్కాల్సిన కీర్తిని, సొమ్ముని, పేటెంట్ హక్కులను గౌరవించక పోవడం నేడు అన్ని రంగాల లో పెచ్చరిల్లిపోతుంది. ఫలితంగా సాహిత్యకారులు, కళాకారులు కోర్టు గుమ్మాలని తట్టాల్సిన పరిస్థితులు మనం ఎన్నో కేసుల్ని బట్టి ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

సాహిత్యంలో వినియోగ సంస్కృతి ఎలా విలువలను ధ్వంసం చేస్తాయో గమనించిన ఏటూరి గత ఇరవై యేళ్ళుగా ఆ దిశగా తన కవిత్వాన్ని ప్రసారం చేస్తున్నాడు. అందుకు తగ్గట్టుగా తన కవిత్వ శైలిని మలుచుకున్నాడు. క్లుప్తంగా, నిగూఢంగా, మార్మికంగా చెప్పే తీరుని సొంతం చేసుకున్నాడు. ఏ కవితనీ 26 పాదాలకు మించితను రాయడు. అలాగే వస్తువు ఆధారంగా కవిత్వం చెప్పే దశని దాటి, తన భావాలనే కవితల రూపంలో ప్రసారం చేయటం **"అలా ఆగు కాసేపు.."** సంపుటిలో పూర్తిగా చూస్తాం. వస్త్వాశ్రయంతో కవిత్వం చెప్పక పోవటం మూలంగా అనుభవాలనే కవిత్వంగా మలచటంలో నాగేంద్ర ఎంత చురుకో ఈ సంపుటి చెప్పకనే చెప్తుంది.

నిజానికి కవి శైలీ శిల్పాలని, సాహితీ సంప్రదాయాలను వినియోగదారు సమాజమే శాసిస్తుందని మనం ఇక్కడ మరువ కూడదు. పాఠకుల సంఖ్య తగ్గిపోయినా, పుస్తక ప్రచురణలు గిడస బారిపోయినా అందుకు కూన్యూ మరిస్ట్ సొసైటీయే కారణమని నిందించి ఏ లాభమూ లేదు. ఒకవిధంగా చూస్తే ఏటూరి నాగేంద్రరావు కవిత్వమంతా ఒక డైరీగా "అలా ఆగు కాసేపు.." కవిత్వాన్ని గమనించి అర్థం చేసుకోవచ్చు.

**"నన్ను నేను జయించటానికి**
**నాలో ఒక తాత్వికుణ్ణి**
**సృష్టించుకున్నాను!"**

అని నాగేంద్ర స్వయంగా ప్రకటిస్తున్నాడు. లోకాన్ని ప్రేమించే సమ్మోహిత విద్య తెలుసుండాలని, కొన్ని కొన్ని దృశ్యాలను జ్ఞాపకాల నుంచి తుడిచెయ్యడం మనసుని సత్యాన్నుంచి విభజించటంగా చూస్తున్నాడు. జీవితంతో సంభాషించే ప్రతిసారి కవిత్వం కోసం అలమటించిన సమయంలో గదిలో నిత్య నరకాన్ని అనుభవించానని **'సమ్మోహనం'** అనే కవితలో స్పష్టం చేశాడు. ఒక తాత్వికుడు తన వెంట తిరుగుతుంటాడు. అందుకే తను అనేకమై సంభాషిస్తాడు. ఇదే మన నాగేంద్ర ప్రత్యేకత.

**"ఇప్పుడలా ఉండకపోవచ్చు**
**దేన్నీపట్టుకొని**
**చర్చించి లాభం లేదు**
**జీవితం కూడా సరైన యుద్ధమే**
**ఛేదించలేక పోతున్న రహస్యమే**
**సమస్తమూ వ్యాపారమే!**
**రక్తం కాదు**
**బుర్రలు కూడా పాడైపోతాయి"**

మనిషి తన జ్ఞాపకాలను తుడిచేసుకుని, దేనికో పరుగులు తీస్తూ సూక్ష్మాంశాలని పట్టుకొని కాలాన్ని లెక్కించటానికి ప్రయత్నిస్తాడు. అప్పుడున్నట్టు ప్రస్తుత సమాజం ఇప్పుడలా వుండక పోవచ్చు. నాగేంద్ర ఉద్దేశంతో గతం తాలూకు అగాధాలని సృష్టించటం లేదా పూడ్చటం, గతంలోని సుఖాల కోసం తాపత్రయపడటం కాలం మనకి చూపిస్తున్న ఓ చరిత్ర. కానీ మనుషులు మూర్ఖంగా పాత కాలం నాటి జ్ఞాపకాల కోసం రంధీ






ప్రతులకు:ఏటూరి నాగేంద్రరావు
ప్లాట్‌నెం.క్యూబి 5
అపర్ణ సైబర్ జోన్,
రత్నదీప్ ఎదురు, నల్లగండ్ల
షేక్‌లింగంపల్లి,
హైదరాబాద్-500019
సెల్: 7416665323

పడ్తూ వాటిని తుడిచేసు కోవాలనుకుంటాడు.

దీన్నే ప్రోగ్రెస్ ఆఫ్ హిస్టారికల్ మెమరి ఎరాసర్ అంటారు. గతాన్ని ఫొటోల ద్వారానో, చరిత్రని తల్చుకునో, జ్ఞాపకాలని గుర్తు చేస్తూ పాఠకులతో మాట్లాడుతూ వుంటారు. ఇమాజి నేటివ్ కన్సర్వేషన్ విత్ రీడర్స్ చేస్తూ వుంటారు. 'ఇప్పుడలా వుండకపోవచ్చు...' అన్న ఒక్క పాదంతో ఎన్నోరకాలుగా పాత కుడితో చేస్తున్న ఈ భాషణంతో to..to restore or recover those sublegated narratives వుందని నాకు తోస్తుంది. ఇప్పుడలా వుండకపోవచ్చు అన్న ఉపేక్షలో చారిత్రక గతం మనల్ని వెంటాడుతోంది. ఇప్పుడలా వుండకపోవచ్చు పాదం ఒక స్వరంతో మన చేతి దీర్ఘకావ్యమే రాయిస్తుంది.

ఏటూరి నాగేంద్ర రావు రచించిన **"అలా ఆగు కాసేపు"** కవిత్వం పుస్తకానికి **సాగర్ శ్రీ రామకవచం** రాసిన ముందుమాట

"కలలన్నీ నిజం కావాలనే రూలేం లేదు
**ఒక్కోసారి స్వాతంత్ర్యంకూడా**
**కత్తిలాగా గుచ్చుకుంటుంది!"**
**"బిడ్డా! నగరం పూర్తిగా నిస్సారమై పోయింది**
**చీకటిని తడమకు, కూలిపోతావ్**
**భయంగా తలవాల్చకు!**
**శలభంలా కాలిపోతావ్!"**

నాగేంద్ర కవిత్వం అంతా ఒక భాషణం గానే కనిపిస్తుంది. తన మోనోలాగ్‌ని కావాలని విస్తృతం చేయడు. ఎక్కడికక్కడ కట్ చేస్తాడు. కొంత గుర్తు చేసి దాన్ని తిరిగి తుడిచేస్తాడు. ఒకోసారి personal memory తోనూ, ఇంకో సారి Collective memory తోనూ, కవిత్వం చెప్తాడు. పై మూడు పాదాలు రీడర్‌తో తను స్వయంగా భాషిస్తున్నాడు. చివరి నాలుగు పాదాలు సామూహికంలో ఒకడిని బిడ్డా! అని పిలిచినా దాన్ని సార్వత్రికం చేసి హెచ్చరిస్తూ చెప్తున్నాడు. ఈ ధోరణిలో కొంత నాటకీయత కూడా వుంది. నిజానికి నాగేంద్ర కవిత్వం ఒక కన్ను అయితే నాటకరంగం మరో కన్ను అని అతన్ని తెలిసిన వాళ్ళందరికీ బాగా తెలుసు.

**"ఎక్కిన రైల్లో**
**కిటికీ దగ్గర పద్యం**
**చాలా సేపు తారసపడింది**
**గుర్తించేలోపు**
**మాయమయ్యింది"**

కవితని నిత్యం స్మరించటం నాగేంద్రకి బాగా అలవాటు. వారంలో కనీసం రెండు మూడు కవితలు రాయ కుండా తను నిద్రపోడు. రాసిన కవితని నాకు చదివి వినిపించి నాకే ఏదో పత్రికకి ఇస్తాడు.

ఇలా రాయలేకుండా ఉండ లేని తత్వంతో నాగేంద్ర సాహిత్య యాత్రలో తను చుట్టూతా మసలే జనం గురించి ఏమడిగినా విమర్శనాత్మకంగా చెప్పగలడు కానీ అదే కాగితం మీద పెట్టి విమర్శనారంగంలోకి ప్రస్థానించ మంటే మటుకు బద్దకిస్తాడు.

×××

**"కార్చిచ్చు నుండి**
**అడవిని కాపాడినంత సులభం కాదు**
**అక్షరంతో సమాజాన్ని మార్చడం"**

వినియోగదారుల సమాజం లో ఇటువంటి ఆత్మగత నిర్వచనం రావటం చూసి ఇప్పుడెవరూ ఆశ్చర్యపోరు. మానవుడి ఉనికికి సంబంధించి రాస్తున్న నాగేంద్ర కవిత్వంలో అస్తిత్వ తన్నుకలాటతో, నిర్వేదంతో రాసిన కవితలు చాలా వున్నాయి. ఇవి కవి ఆత్మఘోషగా, ఈ కావ్యం ప్రత్యేకంగా నిలబడ్తుంది. ఒక ప్రత్యేక గొంతుతో పలికిన ఈ ఆవేదనలో నిజాయితీ వుంది. అందుకే నిర్వచనం కవితలో ఇలా అంటున్నాడు.

**"కాలం**
**ఎప్పుడు విషాదంగా**
**పరిణామం చెందుతుందో**
**తెలియదు**
**దృశ్య మాయాజాలం నిండిన**
**లోకం ఇది..."** ఇంకొంచెం ముందుకు పోయి
**"జీవించడాన్ని, మరణించ డాన్ని**
**సమానంగా చూసే నువ్వు**
**నీ అంతరాత్మతో ఎప్పుడూ ఏకీభవించలేవని"** పాఠకుడితో సంభాషిస్తున్నాడు. ఈ తరహా శైలి గురించి పైన చర్చించాను. కొంత మంది రచయితలు పాఠకుడు ఆలోచించేలా తమ రచన సాగి స్తారు. నాగేంద్ర మటుకు పాఠకుడికి పూర్తిగా అర్థమయ్యేలా అతనితో సంభాషిస్తాడు. ఉదాహరణకి బుక్‌ఫెయిర్ అనే కవితలో సాటి రచయితలతోనే మాట్లాడిస్తున్నాడు.

**పెదవులకి తెలియని నవ్వుల్ని నవ్వుతూ**
**నీవు ఇంకోలా వుండటానికి ఆరాటపడతావ్!**
**అంతా సజావుగానే వుంటుంది**
**కానీ, నీ మనశ్శాంతినెవరో దొంగిలించేశారు!**
**నీ బ్రతుకు చుట్టూ**
**హైటెక్ చిత్రహింసలు నాట్యం చేస్తుంటాయ్!**

ఇప్పుడు బుక్‌ఫెయిర్‌లో రాజసాన్ని కొనితెచ్చుకుని వ్యాపార బరువుని మోస్తుంటారు. దానికి తోడు చేసిన అప్పుల మోతతో తానో రచయితనన్న కిరీటం తగిలించుకుని తిరుగుతుంటే ఎవరికి వారు సమర్థంతమైన పాత్రలను పోషిస్తుంటే ఆవిష్కరణలూ, కల బోతలూ వగైరా మరో సంవత్సరం దాకా ఆశ, కీర్తి కాంక్ష రచయిత చుట్టూతా తిరిగి పిల్లిమొగ్గలు వేస్తాయని నాగేంద్ర బుక్‌ఫెయిర్ తతంగాన్ని ఈ కవితలో ఎండకడ్తాడు.

ఒకోసారి నాగేంద్ర తనలోని అశాంతిని చాలా కవితల్లో ప్రస్తావిస్తాడు. వాటిని క్లుప్తంగా వివరిస్తాను.

**"ఏదో మొదలయ్యింది నాలో**
**వెళ్ళిపోవాలి**
**ఏదీ ఎక్కడా తలుపులు**
**తెరుచుకోవటం లేదు"** (ఒక నిద్ర కోసం)
**"ఇంత ప్రపంచంలో**
**నాకు ఊపిరాడటం లేదు**
**చావుని ముద్దు పెట్టుకోవడం చేతకానివాడికి**
**స్వప్నమందిరాల్ని కట్టే హక్కు లేదు"** (మణిద్వీపం)
**"ఎన్నోసార్లు మరణాన్ని**
**ఆహ్వానించి కూడా బతికాను"** (మరణాన్ని గుర్తించడం)
**"ఇలా వచ్చి అలా వెళ్ళిపోయే అతిథిలా**
**మనమూ అంతేగా**
**అలాగా రాలిపోతాం"** (పక్షి కవిత నించి)
**"అప్పుడప్పుడూ**
**మృత్యువాణి వినిపిస్తున్న**
**గాయకుడి గాత్రం జీవితం"** (వెంటాడే వేటకుక్కల ముందు)
**"ఈ రోజు మంచం మీద**
**ప్రేమ పుడుతుంది**
**కొత్తగా నాకు"** (శవాసనం)
**"అడుగుల చప్పుడు వినిపించని**
**రాత్రిలోకి పారిపోవాలి"** (యుద్ధం కూడా యజ్ఞమే)
**"ఓ రాత్రి**
**భయాన్ని పరిచయం చేసినాక**
**జీవితాన్ని ఎన్నిక చేయటం**
**ఎంత కష్టమో.."** (రంగస్థల కుటుంబం)

**"అలా ఆగు కాసేపు.."** కవితా సంపుటి ద్వారా నాగేంద్ర చాలా గొప్ప కవితలు వినిపించాడు. ఇందులో బైక్ రైడర్, ఒక నడక కోసం, కాస్తంత పుచ్చుకున్నాక, లోయ, వెల్లవేయండి, దుఃఖపు మజిలీ, చలి కాచుకోండి... కవితలు చాలా అద్భుతంగా వున్నాయి.

ఎంతో గొప్ప రంధితో కవిత్వం వినిపిస్తున్న ఒక సీనియర్ కవి ఏటూరి నాగేంద్ర "అలా ఆగు కాసేపు.."లో ఒకే స్వరంతో, ఒకే శైలితో రాసి, ఖండికలుగా కవితలు రాసిన ఏకైక కావ్యం అని గుర్తించదగ్గ రసప్రసారం చేసి మంచి ఈస్తటిక్ దృష్టితో ఒక ఆత్మఘోషని నిజాయితీగా, నిర్భీతిగా వెలువరించాడు. ఒక మంచి కావ్యంగా మలచిన ఏటూరి నాగేంద్రని అభినందిస్తున్నాను.

**-సాగర్**
**శ్రీ రామకవచం**
సెల్:9885473934



తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

-సంపాదకులు

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

## భూవిలాపం

సంజ కెంజాయ నా నొసట
దిద్దిన తిలకమై
పచ్చని వన్నెల ఉపవనాలే
నాకు అందంగా అమరిన
చీర కట్టుగా
పైరగాలులే నా నుదుట
కదలాడే ముంగురులై
సెలయేటి సవ్వడులే
నా పదమంజీరాలై
తొలి పొద్దు వెలుగు రేఖలు
నా ఒంటికి అలదిన పుప్పొడి జిలుగులై
అలురారుతున్న ప్రకృతి కాంతను
జీవసిరులనంతా నాలో పొదువుకున్న
రత్నగర్భనంటూ పొంగిపోయిన నేను...
మానవ తప్పిదాలతో ముంచుకొస్తున్న
విపత్తుకు ఒడలెల్లా పగుళ్ళు పడి
నా తనువులోని అణువణువు వన్నె తగ్గి కోమలత్వం
కొల్లేటి పాలైపోతుంటే ...
వ్యర్థాల అనర్థాలతో
మోడువారిన తరువులు అడుగంటిన చెరువులు
సడలిన మేని బిగువులు వడలిన సోయగాలతో
నిస్సారమై చేష్టలుడిగిన నా దేహం
పెనుతాపాల తాకిడికి అతలాకుతలమై నాఉనికి
గత వైభవమై పోతుందన్న
దిగులు తెగులు
గుండె గూటిని తొలిచేస్తుంటే
కరువు సంకెళ్ళలో బిగుసుకున్న
నా ధరాతలాన్ని కాచే భూధారకుడికై ఆశగా
ఎదురుతెన్నులు
చూస్తున్న నేను...

-రాధికాసూరి

## శిలాశిల్పం !!!

దారి పక్కనున్న
వొర్థి శిలను ఆగి ఆగి ఎవరూ పరీక్షగా మరి
మరీ భూతద్దంతో చూడరు
చూడకుండానే పోతుంటారు.
శిల్పి మనసు పెట్టి
అహోరాత్రులు శ్రమించి దీర్ఘ దృష్టిగా
హృదయ స్పందనలతో
ఆర్ద్రంగా శిలను శిల్పంగా చెక్కితే
వేల జనం ఆగిపోయి శిల్పాన్ని
శిలలా నిలబడి పోయి
రక రకాల కోణాలలో ఆశ్చర్యంగా చూస్తారు
శిల్పిని కొనియాడుతారు
ఉలి కూడ గొప్పదే అంటారు.
ఎందరెందరో శిల్పిని స్వాగతించి
సన్మానిస్తారు
శిల్పం పై కవులు కావ్యాలు రాస్తారు
శిల్పి జీవిత చరిత్ర రాస్తారు
చిత్రకారులు
చిత్ర చిత్ర రంగు రంగుల చిత్రాలు వేస్తారు
శిల శిలగా ఉండిపోతే
గుర్తింపు లేదు-
శిల శిల్పంగా మారితే ప్రపంచ వ్యాప్తం.
శిల శిల్పమైతే శిల్పికి పేరు
శిల్పి ఊరుకు పేరు
శిల్పం విశ్వ కళాఖండం

-కందాళై రాఘవాచార్య
87905 93638

## మరో దేవుడు

గురువు జ్ఞాన వృక్షం
విద్యార్థుల జీవిత పంటలని
పండించే హాలికుడు
అదే పంటకి చీడ పురుగుపడితే
పుస్తక బుట్టలోని క్రమశిక్షణ మందుని చల్లి
ఆ పురుగులను పారదోలే పోలీసు
విద్యార్థి మనుగడ మట్టి ముద్దని
కొట్టో,తిట్టో, ఓ అందమైన ఆకారంగా
రూపుదిద్దే కుమ్మరివాడు
తన శిష్యుల బ్రతుకు బండరాయిని
బంగారు బాపుబొమ్మగా రూపొందించే శిల్పి
చదువును పదిమందికి దానం చేసే గొప్ప దానశీలి
పేదరికపు రోగానికి చదువునే
మందుగా ఇచ్చి నయంచేసిన వైద్యుడు
సమాజపు గుండెలో బతికి ఉన్న
చెడు బుద్ధులను నీతి పద్యాల కత్తులతో
అంతమొందించే యుద్ధవీరుడు
సద్గునాలను సదా బ్రతికించే ఆదర్శమూర్తి
నవయువత పుష్పాలు వికసించేందుకు
తోడ్పడే గాలి,నీరు,వెలుతురు
మొత్తానికి దేశాభివృద్ధికై కృషి చేస్తున్న కలంయోధుడు
ఈ గురువు దేవుడు సృష్టించిన ఈ ప్రపంచాన్ని
వేలు పట్టి సన్మార్గంలో నడిపిస్తున్న మరో దేవుడు
అందుకేనేమో " ఆచార్య దేవో భవః"అన్నారు

- పి.భవ్య శ్రీ

## కళ్లెదుటే కాలం!

ఈ కాలం వెళ్లిపోతోంది
ఊరంతా రందుల నుంచి
ఊరిచివరి సందుల నుంచి
చీకట్ల చివరి కొసల్నుంచి
ఆకట్ల అరుగంచుల నుంచి
ఆశల వాలుచూపుల నుంచి
ఈ కదిలేతొండల మించి
ఆ కదలనికొండల మించి
ఈ చెట్టుకొమ్మల మించి
ఆ పక్షి రెక్కల మించి
ఈ కంటి చూపుల మించి.
ఈ వెన్నెల కిరణాల గుండా
ఆ వేకువ కన్నె చరణాల గుండా
హృదయసాగర అలల గుండా
కల'తల'ఊయల గుండా
సింధునాగరికత నాటి
పేదరికపు లోయల గుండా.
అన్యాయం జాడల నుండి
అధర్మం అడుగుజాడల నుండి
గుట్టుతేలని మర్మపు లోతుల నుండి
బ్రహ్మరాసిన తలరాతల అధికారం నుండి
మానవుణ్ణి ఇంకా వీడని
ఈ అజ్ఞానపు అంధకారం నుండి
కాలం వెళ్లి పోతుంది
కళ్లెదుటి ఈ కాలం వెళ్లి పోతుంది.

-రమేష్ నల్లగొండ
8309452179

## పూలతోట

పచ్చని ఆకుల మధ్య
నవ్వే పువ్వులు
పసిపిల్లల నవ్వుల్లా
మనస్సును దోచుకుంటున్నాయి
రంగు రంగుల రెక్కల సీతాకోక చిలుకలు
ఈ అందమైన తోటలో తిరుగుతున్నాయి
కోకిల పాడే పాటకు అనుగుణంగా
రెక్కలు విప్పి ఆనందంగా ఆడుతున్నాయి
మల్లెలు,గులాబీలు,తామరలు
సువాసనలతో
మనస్సును ప్రశాంతంగా మారుస్తున్నాయి
పక్క పక్కన ఉన్నా అవి పోటీ పడవు
ఒకదాని సువాసనతో మరొకటి ద్వేషపడవు
ఈ పూలు ప్రకృతిని అందంగా
సువాసనబరితంగా మారుస్తున్నాయి
ఈ పూల తోట లాంటిది మన మనస్సు
సంతోషం పువ్వు అయితే
బాధ ముళ్ళ చెట్టవుతుంది
తోటమాలి ప్రేమతో పెంచిన ఈ తోట
మన మనస్సు ప్రశాంతతకు
ప్రకృతి ఇచ్చిన ఒక అందమైన బహుమతి
తోటమాలి ప్రేమకు అన్ని మొక్కలు సమానమే
దేవుని పూజకు ఏ పువ్వయినా పవిత్రమే
ఆకాశంలోని ఇంద్రధనుస్సు
నేలకి దిగిందా అని అనిపించేల
రంగు రంగులపూల వనం ఇది
చిరుగాలి వీచితే ఊగే పూలు
ప్రకృతి మనకు అందించే అందమైన పాటలు
ఆనందకరం , ఆహ్లాదకరం
ముళ్ళ పొదనుండి పువ్వులు నవ్వినట్లే
మనకొచ్చే కష్టాలను దాటి మనం అందరం నవ్వాలి

- ఎమ్.పూజిత

## గురువుగారు

గురువులు అంటేనే దేవుళ్ళు
మేము ప్రతిరోజు
నమస్కరించేది దేవుళ్ళకి
మా ఎదురుగా ఉండి
ఆశీర్వదించేది మీరే
మేము చేతులు జోడించి
మీ ముందు నిలుచుంటే
నిజమైన దేవుళ్ళు ముందున్నట్టే అనిపిస్తుంది
మీతో మాట్లాడితే
నిజమైన దేవులతో మాట్లాడినట్టు ఉంటుంది
గుళ్లోని దేవుళ్లు
మనం వేడుకుంటేనే కరుణిస్తారేమో కానీ
మన బడిలో కనిపించే దేవుళ్ళు మాత్రం
ఏమి కోరకుండానే బ్రతుకిస్తారు

-పి.మృదుల

# చెమట చుక్కపై చెలరేగిన పోరుకేక - వీరనారి చిట్యాల ఐలమ్మ



తెలంగాణ నేల కేవలం పండిత పామరుల సాహిత్య సౌరభాలకే కాదు, సమరశీల ప్రజా ఉద్యమాల గర్జనలకు కూడా పురిటిగడ్డగా నిలిచింది. పాల్కురికి సోమన భక్తి ఉద్యమ చైతన్యం, బమ్మెర పోతన ఆత్మాభిమాన నిరసన వెల్లివిరిసిన ఈ గడ్డపై, శ్రమజీవుల స్వేచ్ఛా పతాకమై ఎగిరిన విప్లవ తేజం చిట్యాల ఐలమ్మ. చాకలి ఐలమ్మగా ప్రజాహృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఈ ధీరవనిత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో పెల్లుబికిన ఆత్మ గౌరవ అగ్నికణం. ఆమె చరిత్ర కేవలం ఒక సామాన్య గ్రామీణ మహిళ తన భూమిని కాపాడుకోవడానికి చేసిన వ్యక్తిగత ప్రతిఘటన కాదు; నిరంకుశ నిజాం పాలనలో, రాబందుల్లా విరుచుకుపడ్డ భూస్వామ్య దొరల పెత్తనానికి వ్యతిరేకంగా రగిలిన సామాజిక విప్లవ శంఖారావం. 1895 సెప్టెంబరు 26న నాటి జనగామ ప్రాంతంలోని కిష్టాపురంలో ఓరుగంటి మల్లమ్మ, సాయిలు దంపతులకు జన్మించిన ఐలమ్మ, చిన్నతనంలోనే పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్యతో వివాహమై అత్తవారింటికి చేరింది. కులవృత్తి అయిన రజక పనితో పాటు వ్యవసాయాన్నే జీవనాధారంగా మలచుకున్న ఆమె కుటుంబం, నాటి నిజాం జాగీర్దారీ వ్యవస్థలో భాగమైన వెట్టి చాకిరీ, కులవివక్ష, అధిక పన్నుల దోపిడీకి గురైంది. నిజాం ఇలాకాలో దేశ్‌ముఖ్‌లు, జమీందార్లు, పటేల్-పట్వారీలు రైతుల రక్తాన్ని జలగల్లా పీల్చుకుతింటున్న కాలమది. ఆ దుర్మార్గాల నడుమ ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్ట పార్టీలు ఊరూరా 'సంఘం' పేరుతో విస్తరించి బడుగు బలహీన వర్గాల్లో చైతన్య రగిలిస్తున్నప్పుడు, ఐలమ్మ ఆ ఎర్రజెండా నీడన అడుగులు వేసి ఉద్యమ బాట పట్టింది.

ఆమె జీవితాన్ని ప్రపంచ విప్లవ పోరాటాల సరసన నిలిపిన చారిత్రక ఘట్టం విస్నూరు దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి అరాచకాలకు వ్యతిరేకంగా చెలరేగింది. పాలకుర్తిలోని మల్లంపల్లి కొండలరావుకు చెందిన 40 ఎకరాల భూమిలో ఐలమ్మ నాలుగు ఎకరాల కౌలు భూమిని సాగు చేసుకుంటూ ధాన్యపు రాశులను పండించింది. అణగారిన వర్గానికి చెందిన మహిళ సంఘం వైపు మొగ్గు చూపడం జీర్ణించుకోలేని విస్నూరు దేశ్‌ముఖ్, తన గుండాలను పురిగొల్పి ఆ పంటను కొల్లగొట్టడానికి కుట్ర పన్నాడు. అప్పటికే ఐలమ్మ భర్త, కుమారులను అక్రమ కేసులతో జైలుపాలు చేసినా ఆమె గుండెల్లో భయం లేశమాత్రమైనా రాలేదు. "నా కష్టార్జితమైన పంటను దొరల పాలు చేయను, ప్రాణమైనా అర్పిస్తాను గానీ ఒక్క గింజను కూడా వదులుకోను" అంటూ బందూకు పట్టిన రజాకార్లు, దొరల లాఠీ గుండాలకు ఎదురొడ్డి కొంగు నడుముకు చుట్టి నిలిచింది. ఆంధ్ర మహాసభ కార్యకర్తలు, భీంరెడ్డి నరసింహారెడ్డి, చకిలం యాదగిరి వంటి యోధుల అండతో, కొడవళ్ళు పట్టిన శ్రామిక మహిళలతో కలిసి స్వయంగా కళ్ళంలోకి దిగి ధాన్యాన్ని కాపాడుకుని బండ్లకెత్తించి తన ఇంటికి చేర్చింది. కష్టజీవి చెమట చుక్కపై దోపిడీదారులకు హక్కు లేదని నిరూపించిన ఈ వీరోచిత ఘట్టం, 1946 నాటి దొడ్డి కొమరయ్య అమరత్వంతో కలిసి దావానలంలా వ్యాపించి, 1946 నుండి 1951 వరకు కొనసాగిన వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి తొలి నిప్పురవ్వగా మారింది.

ఈ ప్రతిఘటన ఫలితంగా వెల్లువెత్తిన ప్రజా సమరంలో దాదాపు 3,000 గ్రామాల్లో గ్రాజ్యుయేట్ భూస్వామ్య వ్యవస్థ కుప్పకూలి గ్రామ స్వరాజ్యం ఏర్పడింది. సుమారు పది లక్షల ఎకరాల భూమిని పేదలు, భూమిలేని వ్యవసాయ కూలీలకు పంచడం ప్రపంచ విప్లవ చరిత్రలోనే ఒక అద్భుత ఘట్టం. ఈ క్రమంలో ఐలమ్మ ఇల్లు ఉద్యమకారులకు ఆశ్రయంగా, రహస్య స్థావరంగా మారింది. ఆ కారణంగా దేశ్‌ముఖ్ గూండాలు ఆమె ఇంటిని లూటీ చేసి, తగులబెట్టి, ఆమె కుటుంబ సభ్యులను చిత్రహింసలకు గురిచేసినా ఆమె ఉద్యమ పంథా వీడలేదు. స్త్రీ అంటే అబల కాదు, సమాజ విముక్తికి కదం తొక్కే సబల అని నిరూపించిన ప్రాతఃస్మరణీయురాలు ఆమె. కులం, వర్గం, లింగం అనే ముప్పేట అణచివేతలను తుత్తునియలు చేస్తూ తుపాకీ చేతబట్టిన తొలితరం వీరవనితగా ఆమె చరిత్రలో నిలిచింది. 1985 సెప్టెంబరు 10న ఐలమ్మ భౌతికంగా కన్నుమూసినా, ఆమె రగిలించిన ఆత్మగౌరవ జ్వాలలు నేటికీ ఆరిపోలేదు. తెలంగాణ ప్రభుత్వం ఆమె జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించడమే కాక, హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయానికి 'వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం'గా నామకరణం చేసి ఆమె వీరత్వాన్ని సమున్నతంగా గౌరవించింది. రాజులు, రాణుల వైభవాలకే పరిమితమైన చారిత్రక రాతలను తిరగరాస్తూ, సామాన్య శ్రమజీవి ఆత్మగౌరవాన్ని ఆకాశమంత ఎత్తున నిలిపిన చాకలి ఐలమ్మ పోరాట పటిమ తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వానికి, స్త్రీ సాధికారతకు శాశ్వత మార్గదర్శిగా నిలిచి తరతరాలకూ స్ఫూర్తిని రగిలిస్తూనే ఉంటుంది.

సెప్టెంబర్ 10... చాకలి ఐలమ్మ వర్ధంతి



-రామ కిష్టయ్య
సంగన భట్ల
9440595494

# తన రచనలకు స్ఫూర్తి కాలమే

-డా॥ఏనుగు నరసింహారెడ్డి



డా॥ఏనుగు నరసింహారెడ్డిని సత్కరిస్తున్న అతిథులు.

హైదరాబాద్, సెప్టెంబర్ 9(నేటినిజం ప్రతినిధి): యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్, సైన్స్ మహిళా కళాశాల సంయుక్తాధ్వర్యంలో సుల్తాన్‌బజార్‌లో గల శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలో తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమంలో భాగంగా 24వ సమావేశం జరిగింది. ప్రముఖ సాహితీవేత్త వంగపల్లి విశ్వనాథం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ఏనుగు నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని తన స్వీయ రచన **"ఏడు కోలల బాయి"** (ఎన్నికల శతకం)పై ప్రధాన ప్రసంగం చేశారు.

కాలమే తనను ఈ రచన చేయడానికి పురికొల్పిందని పలు సంఘటనలను సభికులకు ఆయన వివరించారు.

# కేటీఆర్ సభలో లేకపోయినా సస్పెండ్ చేశారు.. ఇదేం న్యాయమన్న తలసాని

## -అసెంబ్లీని రాజకీయ డ్రామాలకు వేదికగా మార్చొద్దని హితవు

హైదరాబాద్, సెప్టెంబర్ 9:రాష్ట్రాన్ని సాధించిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చావును కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరుకుంటున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. కేసీఆర్ చావును కోరుకున్నారని ఆరోపణలు ఎదుర్కొం టున్న ఎమ్మెల్యేలను సభలో కొనసాగిస్తూ.. సభలో లేని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సస్పెండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. అసెంబ్లీలో చోటుచేసు కుంటున్న పరిణామాలు సభ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫొటోలను కృత్రిమ మేధ సాంకేతికతతో మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారని తలసాని ఆరోపించారు. రాజకీయంగా విభేదాలు ఉండొచ్చని, అయితే వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఇలాంటి చర్యలపై ప్రభుత్వం, సభాపతి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీలో ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలకు సంబంధించిన అనేక కీలక సమస్యలు ఉన్నప్పటికీ వాటిపై చర్చించకుండా శాసనసభను రాజకీయ విమర్శలు, ఆరోపణలకు వేదికగా మార్చుతున్నారని అన్నారు.

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపైనా తలసాని విమర్శలు చేశారు. మొదటి రోజు అసెంబ్లీ గేటు బయట, రెండో రోజు కేసీఆర్ నివాసం వద్ద రాజకీయ నాటకాలకు తెరలేపారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన సమయంలో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం విచారకరమన్నారు.

ప్రభుత్వం చర్చకు భయపడుతోందని ఆరోపణ

శాసనసభలో 22-ఏ అంశం, జీవో 97పై చర్చకు వస్తుందన్న భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర అంశాలను తెరపైకి తెస్తోందని తలసాని ఆరోపించారు. ఆయా అంశాలపై సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని డిమాండ్ చేశారు. సభా సమయాన్ని రాజకీయ వివాదాలకు కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగించాలని సూచించారు.

# ప్రముఖ కవి, రచయిత 'సలీం' కు 'మహాకవి గురజాడ అవార్డు'

హైదరాబాద్, సెప్టెంబర్ 9: సహృదయ సాహితి 1992లో నెలకొల్పిన 'మహాకవి గురజాడ అవార్డు' ఈ సంవత్సరం 2026 నకు సుప్రసిద్ధ కథా, నవల రచయిత, కవి 'సయ్యద్ సలీం' గారికి ప్రదానం చేయడానికి అవార్డు కమిటీ నిర్ణయించింది. ఇంతవరకు ఈ అవార్డును ఆరుద్ర, రావిశాస్త్రి, కాళోజీ, శేషేంద్ర, దాశరథి రంగాచార్య, మాలతీచందూర్, ఆవంత్స సోమసుందర్, కాళీపట్నం రామారావు లకు ప్రదానం చేయడం జరిగింది. 2026 సంవత్సరానికి ఈ అవార్డును ప్రముఖ రచయిత 'సలీం' గారికి ఇవ్వడానికి నిర్ణయించిన సందర్భంగా మహాకవి గురజాడ జయంతి రోజున సెప్టంబరు 21 తేదీన అవార్డు గ్రహీతకు నగదు బహుమతి, జ్ఞాపిక, సత్కారం నగర ప్రముఖులు, సాహితీవేత్తల సమక్షంలో విశాఖపట్నం పౌర గ్రంథాలయం లో జరిగే అవార్డు ప్రదానోత్సవ సభలో ప్రదానం చేయడం జరుగుతుందని సహృదయ సాహితి అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ తెలిపారు.

# బేతవోలు రామబ్రహ్మం,దొండపాటి నాగజ్యోతిలకు కవి సంధ్య సాహితీ పురస్కారాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 9:'కవిసంధ్య' ప్రతీ ఏటా ఇచ్చే 'శిఖామణి జీవన సాఫల్య సాహితీ పురస్కారం-2026'కు ప్రముఖ పద్య కవి, కావ్య వ్యాఖ్యాత , కేంద్ర సాహిత్య అకాడెమి అనువాద అవార్డు గ్రహీత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, కవిత్వంలో యువకవులకు యిచ్చే 'శిఖామణి యువపురస్కారం-2026'కు కవయిత్రి దొండపాటి నాగ జ్యోతి ఎంపిక అయ్యారు.

వీరితో పాటు మరో అయిదుగురు కవి సంధ్య ప్రతిభా పురస్కారాలు అందుకుంటారు.ఈ మేరకు పురస్కారాల కమిటీ దాట్ల దేవదానం రాజు (అధ్యక్షులు )సభ్యులు కె.శివారెడ్డి,కొలకలూరి ఇనాక్,శిఖామణి,అవధానుల మణిబాబు ఒక ప్రకటన లో తెలియ చేశారు.పురస్కారాల ప్రదానం అక్టోబర్ చివరి వారం లో యానాం లో జరిగే శిఖామణి సప్తతి సాహితీ సదస్సు లో ఉంటుందని దాట్ల దేవదానంరాజు తెలిపారు.

# బీసీ గురుకుల పాఠశాలలో విషాదం.. ఆడుకుంటూ కుప్పకూలి విద్యార్థి మృతి

ఖమ్మం, సెప్టెంబర్ 9: ఖమ్మం జిల్లా రఘునాథపాలెం బీసీ గురుకుల పాఠశాలలో తీవ్ర విషాదం నెలకొంది.

ఆడుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలి ఎనిమిదో తరగతి విద్యార్థి మరణించాడు. అయితే గుండెపోటుతో మరణించారని అనుమానిస్తున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. తిరుమలాయపాలెం కాకరవాయి గ్రామానికి చెందిన సలిగంటి హరీశ్ ప్రియాంక కుమారుడు సాత్విక్ (14) మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతు న్నాడు. రోజూలాగే ఇవాళ ఉదయం 5 గంటలకు లేచి గురుకుల ప్రాంగణంలో సాత్విక్ ఆడుకున్నాడు.

రన్నింగ్ చేసిన వచ్చిన సాత్విక్ ఒక్కసారిగా కుప్పకూలాడు. ఇది గమనించిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు వెంటనే సపర్యలు చేశారు. హుటాహుటిన ఖమ్మం సర్వజనాసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. గుండెపోటుతోనే సాత్విక్ మరణించాడని అంటున్నారు.

అయితే సాత్విక్ మరణంపై బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాలుడి మృతికి మరేదో కారణం ఉండొచ్చని ఆరోపిస్తున్నారు









Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.